

జై భీమ

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 334 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 05, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

మట్టి మాఫియాను..

మట్టి కరిపించాలి !





డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



మట్టి తవ్వకాలతో బీభత్సాలు సృష్టిస్తున్నారు.

రాత్రనకా పగలనకా ఒకటే తవ్వకాలు.

దగా కోరు పనికి దట్టమైన సహకారం లభిస్తుంది.

మొరం తవ్వకాలతో మారుమోగుతున్న గుంతలు.

ప్రజల ఉసురు పోసుకుంటున్న అక్రమం మొరం రవాణా దారులు.


ప్రతి చోటా అమ్ముడుపోతున్న ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు.

అక్రమం దందాను పట్టుడు లేదు పట్టింపు లేదు.

మొరం దందాలు క్రషర్ల దండాలు పక్కపక్కనే సాగుతున్నాయి.

అక్రమ దందాలలో రాజకీయ నాయకుల జోక్యం జోరుగా పెరుగుతుంది.

వీధిలైట్ల వెలుతురులో మమొరందంద శబ్ద ధ్వనుల చప్పుడు మారుమోగుతుంది : డాక్టర్ బరిగెల శివ



మట్టి మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట పడేదెప్పుడు?

మొరం తవ్వకాలతో పల్లెలు, పట్టణాల పరిసరాలు గుల్లవుతున్నాయి. రాత్రనకా.. పగలనకా యథేచ్ఛగా తవ్వకాలు, రవాణా సాగుతున్నాయి. అనుమతుల మాటున అక్రమ వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల ఫిర్యాదులు పట్టించుకునే అధికారులు కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాజకీయ పలుకుబడి, అధికారుల అండతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు. జర్నలిజం ముసుగులో కొందరు అక్రమ వ్యాపారాలకు సహకరిస్తున్నారంటూ ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడేందుకు అక్రమ మొరం, క్రషర్ల దందాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

వివరాలు 2లో

మణుగూరు డిపో మహిళా కండక్టర్ ప్రవళిక మృతి.. కుటుంబానికి ప్రభుత్వం అండ

ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు.. రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, రూ.కోటి ప్రమాద బీమా



2

మిస్ యూనివర్స్ కిరీటమే లక్ష్యం

ప్యూర్టోరికోకు బయల్దేరిన భారత సుందరి కజియా

కేరళ నుంచి టైటిల్ గెలిచిన తొలి యువతి

19 ఏళ్ల వయసులోనే ఎన్నో విజయాలు

న్యాయశాస్త్ర విద్యతో పాటు కళల్లోనూ ప్రతిభ

నవంబర్ 24న మిస్ యూనివర్స్ ఫైనల్

హైదరాబాద్, నవంబర్ 4 (జై భీమ్ న్యూస్) :

75వ మిస్ యూనివర్స్ 2026 పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించేందుకు మిస్ యూనివర్స్ ఇండియా విజేత కజియా లిజ్ మెజో ప్యూర్టోరికో బయల్దేరి వెళ్లింది. కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా, ఆ రాష్ట్రం నుంచి మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని గెలుచుకున్న తొలి యువతిగా గుర్తింపు పొందింది. బుధవారం ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సంప్రదాయ చీర, కిరీటంతో భారత జాతీయ జెండాను చేతబట్టి ఆత్మవిశ్వాసంతో పయనమైంది. ఆమె ప్రయాణాన్ని అభినందిస్తూ మిస్ యూనివర్స్ ఇండియా సంస్థ సోషల్ మీడియాలో ఫొటోలు పంచుకుంది. 2007లో జన్మించిన కజియా బాల్యాన్ని అబుదాబిలో గడిపింది. 17 ఏళ్ల వయసులో మిస్ టీన్ దివా 2024 టైటిల్ గెలుచుకోగా, మిస్ టీన్ ఇంటర్నేషనల్ 2025లో ఫస్ట్ రన్నరప్‌గా నిలిచింది. ప్రస్తుతం న్యాయశాస్త్రం అభ్యసిస్తున్న ఆమెకు మోడలింగ్‌తో పాటు కళలపైనా ఆసక్తి ఉంది. 12 ఏళ్లుగా శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందిన కజియా, వయోలిన్, డ్రమ్స్ వాయించడంతో పాటు గాత్రంలోనూ ప్రతిభ కనబరుస్తోంది. ప్యూర్టోరికోలోని శాన్ జువాన్‌లో ఉన్న జోస్ మిగెల్ అగ్రెలట్ కొలిజియంలో మిస్ యూనివర్స్ పోటీలు జరగనుండగా, నవంబర్ 24న ఫైనల్ నిర్వహించనున్నారు. దాదాపు 130 దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొననున్న ఈ పోటీల్లో భారత కీర్తిని చాటడమే కజియా లక్ష్యం.



సదర్ ఉత్సవాలు యాదవుల ఆత్మగౌరవానికి, ప్రతిబింబం

సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 4 (జై భీమ్ న్యూస్) :

హైదరాబాద్ సదర్ ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి యాదవ సోదర, సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పశుసంపద వైభవానికి ప్రతీకగా నిలిచే హైదరాబాద్ సదర్ ఉత్సవాలు యాదవుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, వారసత్వ గొప్పతనానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతుల ప్రదర్శనలు, వాటి లీవి, దర్పం, సందడి సదర్ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. ఈ ఉత్సవాలు యాదవుల జీవన వైభవాన్ని చాటి చెబుతాయన్నారు. ఈ సదర్ ఉత్సవాలు ప్రతి యాదవ కుటుంబంలో ఆనందోత్సాహాలు నింపాలని, అందరికీ సిరిసంపదలు, ఆయురారోగ్యాలు కలగాలని, యాదవుల ఐక్యత, అభ్యున్నతి మరింత బలోపేతం కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

రూ.2 కోట్ల లంచం ఆరోపణలు..

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం అనుమతి

2006 నాటి లంచం ఆరోపణలపై దర్యాప్తు

రూ.2 కోట్లు డిమాండ్ చేశారని కాంట్రాక్టర్ సాజన్ ఫిర్యాదు

సెక్షన్ 17(ఏ) కింద విచారణకు ఆమోదం

ముఖ్యమంత్రి సతీశన్‌తో చర్చించినట్లు హోంమంత్రి వెల్లడి

2

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

మణుగూరు డిపో మహిళా కండక్టర్ ప్రవళిక మృతి.. కుటుంబానికి ప్రభుత్వం అండ

ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు.. రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, రూ.కోటి ప్రమాద బీమా



హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక ప్రయాణికులతో ఇటీవల జరిగిన వివాదంలో బస్సు టైర్ల కింద పడి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రవళిక మృతి చెందారు. ఈ విషాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి, ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం అండగా నిలవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నారు. అలాగే ఆర్టీసీ తీసుకున్న నిర్ణయం మేరకు బ్యాంకు ద్వారా రూ.1 కోటి ప్రమాద బీమా కూడా ప్రవళిక కుటుంబానికి అందనుంది. ప్రవళిక కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించనున్నాయి. మహిళా కండక్టర్ మృతి పట్ల పలువురు విచారం వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.

ప్రవళిక మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం

సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 4 (జై భీమ్ న్యూస్) :

టీజీఎస్ ఆర్టీసీ మణుగూరు డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రగ్రాన్ని, విచారాన్ని వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ప్రవళిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రూ.2 కోట్ల లంచం ఆరోపణలు..

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం అనుమతి
2006 నాటి లంచం ఆరోపణలపై దర్యాప్తు
రూ.2 కోట్లు డిమాండ్ చేశారని కాంట్రాక్టర్ సాజన్ ఫిర్యాదు
సెక్షన్ 17(ఏ) కింద విచారణకు ఆమోదం
ముఖ్యమంత్రి సతీశన్‌తో చర్చించినట్లు హోంమంత్రి వెల్లడి



ఢిల్లీ, జై భీమ్ న్యూస్

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో కేరళం ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు అనుమతించింది. 2006లో కేరళం ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ కాంట్రాక్టు బిల్లులు క్లియర్ చేసేందుకు రూ.2 కోట్లు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకుంది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ) కింద విచారణకు అనుమతించినట్లు రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితల బుధవారం వెల్లడించారు. ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతుందని చెప్పారు. మలేసియాకు చెందిన ఇంజినీర్ లీ సీ బిన్ నుంచి జ్ఞానేశ్‌కుమార్ రూ.2 కోట్లు డిమాండ్ చేశారంటూ కాంట్రాక్టర్ వీ.ఓ. సాజన్ గతంలో ఆరోపించారు. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు (కేఎస్‌టీపీ) పనులు చేపట్టిన పాథిబెల్ సంస్థకు లీ సీ బిన్ అనుబంధంగా పనిచేశారు. ఆ సంస్థకు సాజన్ సబ్ కాంట్రాక్టర్‌గా మెటీరియల్ సరఫరా చేసేవారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను జ్ఞానేశ్‌కుమార్ నిలిపివేసి, వాటిని విడుదల చేయడానికి రూ.2 కోట్లు అడిగారని సాజన్ మీడియాకు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో లీ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, ఈ విషయాన్ని తనతో చెప్పుకొన్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం లీ ఆత్మహత్య చేసుకుని మరణించారు. జ్ఞానేశ్‌కుమార్ ప్రస్తుతం సీఈసీగా ఉన్నప్పటికీ, గతంలో పీడబ్ల్యూడీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని చెన్నితల స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పులు కూడా విచారణకు ఆటంకం లేదని చెబుతున్నాయని అన్నారు. సీఈసీ పదవికి సంబంధించిన రక్షణ, గతంలో నిర్వహించిన ఇతర పదవుల్లో తీసుకున్న చర్యలకు వర్తించదని వివరించారు. గతంలో జరిగిన విజిలెన్స్ విచారణ జ్ఞానేశ్‌కుమార్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకే ఉద్దేశించినట్లు సాజన్ ఆరోపించారు. తాజా అనుమతితో ఈ వ్యవహారంపై మరోసారి విచారణకు మార్గం సుగమమైంది.

మట్టి మాఫియాను మట్టి కరిపించాలి

మట్టి తవ్వకాలతో బీభత్సాలు సృష్టిస్తున్నారు.
రాత్రనకా పగలనకా ఒకటే తవ్వకాలు.
దగా కోరు పనికి దట్టమైన సహకారం లభిస్తుంది.
మొరం తవ్వకాలతో మారుమోగుతున్న గుంతలు.
ప్రజల ఉసురు పోసుకుంటున్న అక్రమం మొరం రవాణా దారులు.
ప్రతి చోటా అమ్ముడుపోతున్న ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు.
అక్రమం దందాను పట్టుడు లేదు పట్టింపు లేదు.
మొరం దందాలు క్రషర్ల దండాలు పక్కపక్కనే సాగుతున్నాయి.
అక్రమ దందాలలో రాజకీయ నాయకుల జోక్యం జోరుగా పెరుగుతుంది.
వీధిలైట్ల వెలుతురులో మమొరందంద శబ్ద ధ్వనుల చప్పుడు మారుమోగుతుంది.
డాక్టర్ బరిగెల శివ



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

అక్రమంగా సాగుతున్న మొరం దంధాను మట్టికరిపించాలని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు. ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్న అక్రమ మొరం వాహనాల రవాణా శబ్దాలు ప్రజలకు తీవ్రమైన అంతరాయాలు సృష్టిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలో చూసిన మొరం దందా విపరీతంగా పెరుగుతుందని వాటిని అడ్డుకోవడానికి గ్రామస్థాయి రాజకీయ నాయకులు మొదలుకొని ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు ఏమాత్రం సాహసం చేయలేకపోతున్నారని నిలదీశారు. మొరందందను స్వేచ్ఛగాను యదేచ్ఛగాను కొనసాగించడానికి అక్రమ వ్యాపారులంతా రాజకీయ నాయకుల పైరవీలతో సంబంధిత అధికారులను లంచాలు ఇచ్చికొంటున్నట్లుగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అక్రమ దందా తెలియజేస్తుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇలాంటి అక్రమ దందాపై అడ్డుపడుతూ నిలదీస్తూ పోరాటాలు చేస్తుంటే సంబంధిత అధికారులు మొరంద క్రషర్ల దందా అక్రమార్కులకు అండగా నిలుస్తుండడంతో ప్రజల పోరాటాలకు విలువ లేకుండా పోతున్నాయని అన్నారు.

అధికారుల జవాబుదారీతనం ఎక్కడ..

రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న మొరం, క్రషర్ల దందాకు అడ్డగోలుగా సహకరిస్తున్న అధికారులు అంతా రాష్ట్ర ప్రజలకు జవాబుదారీతనాన్ని చూపించాల్సింది పోయి అక్రమ దండకం సహకరిస్తూ ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని ప్రభుత్వం నుండి తీసుకుంటున్న జీతాలు సరిపడక అక్రమ వ్యాపారాలతో రెచ్చిపోతున్నారని ప్రధానంగా ఇరిగేషన్ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అక్రమ దందాకు హద్దులు లేకుండా పోతున్నాయని సూటిగా నిలదీశారు. ప్రతి జిల్లాలో ఎన్ని క్రషర్లు నడుస్తున్నాయో ఎన్ని ప్రాంతాల్లో మొరం దందా అక్రమంగా నడుస్తుందో ఆయా ప్రాంతాల్లోని ప్రతి అధికారిక కార్యాలయాల్లో సంబంధించిన అక్రమ వ్యాపారుల ఆధారాలు ఉన్నప్పటికిని వాళ్లపై కఠినమైన శిక్షలను వేయడానికి పోలీసు అధికారులకు లేఖల ద్వారా సిఫారసు చేయకపోవడం అక్రమ దందాను ఆయా శాఖల అధికారులే దగ్గరుండి పెంచి పోషిస్తున్నట్లు బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న అక్రమ దండ ఆధారాలు ప్రస్ఫుటంగా తెలియజేస్తున్నాయన్నారు. పైగా ఇలాంటి అక్రమ దందాపై సమాచారం చేరవేస్తున్న వ్యక్తులను మానసికంగా వేధిస్తూ అక్రమ దండ వ్యాపారులకు ఫలన వ్యక్తులు మీపై అభియోగం మోపుతున్నారు అంటూ సమాచారం చేరవేస్తూ అక్రమ దందా వ్యాపారులతో సామాన్య ప్రజలపై దాడులు చేయిస్తున్న ఇరిగేషన్ రెవెన్యూ అధికారుల అక్రమ భాగోతాలను పై అధికారులు తక్షణ పాటుగా పట్టించుకోని కఠినంగా శిక్షించాలన్నారు. అక్రమ దందాను నిలుపుదల చేయాల్సిన ప్రభుత్వ అధికారులు ప్రతి చోట మొద్దుబారినతనాన్ని ప్రదర్శిస్తూ అక్రమ వ్యాపారాలతో ఆయా ప్రాంతాల భూసారాన్ని బొందలతో నింపుతున్నారని వాటి వల్ల ప్రజలకు తీవ్రమైన ప్రమాదాల సంభవించే ఆస్కారం ఉందన్నారు. శబ్ద కాలుష్యాలను నివారించాల్సిన అధికారులు రాత్రిపూట జరుగుతున్న మొరం దందాను క్రషర్ల దందాను ఎంత ఎక్కువగా పెంచి పోషిస్తే అంతా అవినీతి సొమ్మును సంపాదించుకోవచ్చునని దుర్బుద్ధితో ఇటు ప్రభుత్వ ఉద్యోగాన్ని అటు ప్రైవేట్ వ్యాపారాన్ని సమపాలుగా పెంచి పోషిస్తూ ప్రజల మనోభావాలతో ప్రాంతాల మనోభావాలతో ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగ హక్కులతో సంబంధం లేకుండా కేవలం పైస సంపాదన మోజును అడ్డం పెట్టుకొని ప్రతి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను చిందరవందర చేస్తున్నారని హెచ్చరించారు. దీని పర్యవసానంగా ప్రతి జిల్లాలోని జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ అనుమతులతో మొరం దందాపై క్రషర్ల దందాపై ఉక్కు పాదం మోపితే తప్ప అడ్డగోలు దందా ఆగేలా లేదంటూ ప్రజలు లబోదిబోమని మొత్తుకుంటున్నారన్నారు. అక్రమ వ్యాపార దందాతో రెచ్చిపోతున్న ప్రతి ఒక్కడు రాజకీయ పార్టీలను అడ్డం పెట్టుకొని ప్రభుత్వ అధికారుల సహాయంతో ప్రజలను పలు ప్రాంతాలను తీవ్ర నష్టం లోకి నెట్టేస్తున్నారని హెచ్చరించారు. రాత్రిపూట జరుగుతున్న అక్రమ వ్యాపారాల వల్ల కాలుష్య వాతావరణం ఏర్పడి చాలా ప్రాంతాల్లోని ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యాల కన్నా పలు ప్రాంతాలలోని భూముల రక్షణ కన్నా ఏది మిన్న కాదని తెలిసినప్పటికీ గుట్టలను కొండలను అక్రమంగా తోడుతూ క్రషర్ల దందాను నడుపుతున్న తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటలాడుతున్న దొడ్డిదారి వ్యాపారాలను నియంత్రించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను కోరారు.

అక్రమ వ్యాపారులు ఎవరు..

అక్రమ వ్యాపారాలకు అండగా నిలుస్తుంది ఎవరు..

ప్రతి జిల్లాలో జరుగుతున్న అక్రమ క్రషర్ల దందా వెనకాల దొంగల ముఠాకు సంబంధించిన కొంతమంది పనికిమాలిన జర్నలిస్టులు ఉంటున్నట్లుగా విశ్వాసనీయ సమాచారం అన్నారు. వాళ్లే అధికార కార్యాలయాలపై పెత్తనం చేస్తూ వార్తలు రాస్తామని బెదిరిస్తూ వాళ్ళ అక్రమ దందాకు ఏ ఒక్కడు అడ్డు రాకుండా పేపర్లను అడ్డం పెట్టుకొని పలు విధాలుగా బెదిరింపులకు పాల్పడుతూ ఇష్టం వచ్చినట్లు దండా చేస్తూ సమాజాన్ని కాపాడాల్సిన వాళ్లే సంఘవిద్రోహ శక్తులుగా తయారై ఇరిగేషన్ రెవెన్యూ రాజకీయ నాయకులను మభ్యపెడుతూ దిగజారుడు వ్యాపారాలు చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. సమాజాన్ని ప్రభావితం చేయాల్సిన బాధ్యతయుతమైన జర్నలిజాన్ని కొంతమంది దగుల్బాజీ వెధవలు వ్యాపారానికి వాడుకుంటున్నారని నిజాయితీగా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యాపారాలు చేసుకోవడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవుగాని ఇలా అక్రమమైన మార్గంలో దొంగ వ్యాపారాలు చేస్తూ జర్నలిజం విలువలను సమాజంను నాశనం చేయడానికి తీవ్రంగా కుట్రలు పన్నుతున్నారని అలాంటి వాళ్ళు జర్నలిజం మానేసి అక్రమ క్రషర్ల దందా అక్రమ మొరం దందా నడుపుకొని ఉన్నతమైన స్థాయిలో డబ్బులు సంపాదించుకోవడానికి ఎలాంటి అభ్యంతరాలు ఉండవని తెలిపారు. సమాజంలో నిజాయితీతో పని చేసే జర్నలిస్టులు చాలా చోట్ల ఇలాంటి వెధవ తక్కువ పనులు చేసే మూర్ఖుల వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అదే క్రమంలో జర్నలిస్టులు అంటే సమాజంలో ఏమాత్రం గౌరవ మర్యాదలు లేకుండా పోతుందని గుర్తు చేశారు. సమాజ శ్రేయస్సు కోరే వాళ్ళే సమాజాన్ని నాశనం చేస్తే విలువలు ఎక్కడ ఉంటాయంటూ సూటిగా నిలదీశారు. మరికొంత శాతం వ్యక్తులు జర్నలిజం ముసుగులో అక్రమ మొరం దందా వ్యక్తుల వద్ద చందాల రూపంలో డబ్బులు తీసుకుంటూ పరోక్షంగాను, ప్రత్యక్షంగాను వాళ్లకు సహకరిస్తున్నారని మండిపడ్డారు. ఇరిగేషన్ రెవెన్యూ అధికారులతో సత్సంబంధాలు పెంచుకొని ఇలాంటి అక్రమ వ్యాపారాల్లో పార్టనర్ షిప్స్ లాంటి లావాదేవీలతో కూడిన వ్యాపారాలు నడుపుతూ సమాజంలో చలామణి అవుతున్నారని అలాంటి వాళ్ళ భరతం పట్టడానికి ప్రతి జిల్లాలోని పోలీస్ శాఖ ఉక్కు పాదం మోపాలన్నారు. ప్రభుత్వ అధికారులు తప్పులకు పాల్పడడమే కాకుండా ఇలాంటి అక్రమ దందాకు సహకరించడానికి జర్నలిస్టులను సైతం వ్యాపారాల్లోనికి లాగడం వాళ్లతో సామాన్యులను ప్రభుత్వ అధికారులను బెదిరింపులకు పాల్పడేలా చేయడం అధికారులు చేస్తున్న అక్రమ సహకారానికి కొంతమంది జర్నలిస్టులు నిండు సహకారంగా వాడబడుతూ ఉపయోగకరంగా ఉంటున్నారని సభ్య సమాజం దుమ్మెత్తి పోస్తుంది అన్నారు. ప్రతి స్టేషన్లో ఇసుక దందాను మొరం దందాను క్రషర్ల దందాను నడుపుతున్న వ్యక్తుల జాబితాను సిద్ధపరిచి వాళ్లపై వాళ్ళ కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా వేస్తూ సమాజాన్ని ప్రజలను రక్షించాలని కోరారు. ఈ మధ్యకాలంలో అక్రమాలకు పాల్పడుతున్న ఇలాంటి దగుల్బాజీలకు కొంతమంది నల్లకోటు వేసుకున్న వ్యక్తులు కూడా పూర్తిగా సహకరిస్తున్నారని మొత్తం మీదుగా అక్రమ క్రషర్ల దందా అక్రమ మొరం దందా అనేది మూడు పువ్వులు ఆరు కాయలు లాగా కళకళలాడుతుందని అన్నారు. గ్రామస్థాయి పాలనలో సర్పంచులు మున్సిపాలిటీ స్థాయిలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జిల్లాస్థాయిలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా ఈ విధంగా అందరూ ఏకమై రెవెన్యూ ఇరిగేషన్ కార్యాలయాలకు అనుకూలమైన అధికారులను పోస్టింగుల రూపంలో తెప్పించుకొని ఇలాంటి అక్రమ వ్యాపారాలను కొనసాగించడం వల్ల ప్రతి ప్రాంతంపై పగ పెంచుకుంటున్నారని అన్నారు. కొంతమంది పోలీస్ అధికారులు కూడా వాళ్ల బాధ్యతను మరిచి ఇలాంటి అక్రమ దందాకు సహకరిస్తూ నెలమామూల్ల రూపంలో పెద్ద ఎత్తున డబ్బులు దండుకుంటున్నారని విమర్శించారు. అదే క్రమంలో అక్రమంగా డబ్బులు వసూలు చేయడానికి ఏమాత్రం అభ్యంతరం లేకుండా క్రషర్ల దందాలో మొరం దందాలో పాలి భాగస్తులైన జర్నలిస్టులను వాడుకుంటున్నారని రాష్ట్రమంతా పెద్ద ఎత్తున విమర్శలు కలవన్నారు. వృత్తి ధర్మాన్ని అడ్డం పెట్టుకొని అక్రమ దందాలో మునిగి తేలుతూ బాధ్యతను మరిచిన వ్యక్తులను శక్తులను అధికారులను ప్రజాప్రతినిధులను ప్రజలందరూ తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా సాగుతున్న ఇలాంటి దందాపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లకు అన్ని జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ కఠినమైన చర్యలు తీసుకునే విధంగా ఆదేశిస్తూ ప్రజల ఆరోగ్యాలను ఆయా ప్రాంతాల బాగోగులను రక్షిస్తూ అక్రమ దందాలను నిర్మూలిస్తూ వాళ్లకు సహకరిస్తున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు.

దివంగత ఆలా నాయక్ వర్ధంతి సందర్భంగా నిమ్స్‌లో రక్తదాన శిబిరం

బలీవ్ మీ డోనార్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం.. పలువురు స్వచ్ఛంద రక్తదానం





హైదరాబాద్, 4 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

దివంగత ఆలా నాయక్ వర్ధంతిని పురస్కరించుకుని నిమ్స్ ఆసుపత్రిలో బిలీవ్ మీ డోనార్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ ఫౌండర్ లావుద్య నాగేందర్ నాయక్, రాందాస్ నాయక్ తమ తండ్రి జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, ఆసుపత్రి యాజమాన్య సహకారంతో ఎమర్జెన్సీ బ్లాక్‌లోని బ్లడ్ బ్యాంక్ విభాగంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ ఇమ్యునోహెమటాలజీ విభాగాధిపతి డాక్టర్ వి. సుధీర్ కుమార్, అడిషనల్ ప్రొఫెసర్లు డాక్టర్ బి. మురళీకృష్ణ, డాక్టర్ కె. మహేష్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, స్వచ్ఛంద రక్తదానం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. తండ్రి వర్ధంతిని కేవలం స్మారక కార్యక్రమానికే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు.ఈ శిబిరంలో మోహన్, మల, శేఖర్, వెంకట్, సుశీల, చంద్రకళ, నరేష్, రవితేజ, సేవ, సరిత, కిషన్, శ్రీకాంత్, వీరు, అక్షయ్, పవన్, స్వామితో పాటు పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమానికి సహకరించిన నిమ్స్ వైద్య బృందానికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. రక్తదాతలందరికీ బిలీవ్ మీ డోనార్స్ క్లబ్ ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

విపత్తుల నిర్వహణలో కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ





యువ ఆపద మిత్ర శిక్షణలో చురుకుగా పాల్గొన్న 19 మంది విద్యార్థులు

కేయూ క్యాంపస్ । నవంబర్ 4 । జై భీమ్ న్యూస్

కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్, సాంకేతిక కళాశాలకు చెందిన 19 మంది జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు యువ ఆపద మిత్ర శిక్షణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2, 2026 వరకు వరంగల్‌లోని మామ్నూర్ శిక్షణ శిబిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 15 మంది బాలికలు, నలుగురు బాలురు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో సేవలందించేలా ఆచరణాత్మక శిక్షణ

ప్రకృతి వైపరీత్యాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించేలా విద్యార్థులను సిద్ధం చేయడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా విపత్తుల నిర్వహణ, ప్రథమ చికిత్స, సహాయక చర్యలు, అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన విధానాలపై విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ అందించారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యతతో పాటు విపత్తుల సమయంలో బాధితులకు సహాయం చేసే నైపుణ్యాలు పెంపొందనున్నాయి.

విద్యార్థులను అభినందించిన విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు

ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రమ్, ప్రత్యేక విధుల అధికారి ఆచార్య బి. వెంకట్రామ్ రెడ్డి అభినందించారు.అదేవిధంగా ఇంజినీరింగ్, సాంకేతిక కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్. రమణ, జాతీయ సేవా పథకం కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య ఈసం నారాయణ, కార్యక్రమ అధికారులు డాక్టర్ డి. శైలజ, డాక్టర్ ఎం. సౌజన్యతో పాటు కళాశాల అధ్యాపక, బోధనేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలిచే నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడంలో ఈ శిక్షణ కార్యక్రమం కీలకంగా నిలిచింది.

ఆరోగ్య రంగంలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో కీలకం





ఔషధాల నాణ్యత, సురక్షిత వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ఆచార్య గాదే సమ్మయ్య

మహబూబాబాద్ । నవంబర్ 4 । జై భీమ్ న్యూస్లి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫార్మసీ కళాశాల, మహబూబాబాద్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌కు చెందిన ఆచార్య గాదే సమ్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమని, వారు కేవలం ఔషధాలను అందించే వారే కాకుండా రోగులకు సరైన ఔషధ వినియోగంపై మార్గదర్శనం చేసే ఆరోగ్య సంరక్షణ నిపుణులని పేర్కొన్నారు. ఔషధాల నాణ్యత, సురక్షిత వినియోగం, ఔషధ పరిశోధనలు, నూతన ఔషధాల తయారీ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్యులు, ఫార్మసిస్టులు, ఇతర ఆరోగ్య నిపుణులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని వివరించారు. ఫార్మసీ విద్యార్థులు చదువుతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని, సేవాభావంతో సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని ఆచార్య గాదే సమ్మయ్య సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు అనేక అవకాశాలు ఉన్నాయని, ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టులు వెన్నెముక వంటి పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఫార్మసీ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, పరిశోధనలు, ఔషధ తయారీ విధానాలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇలాంటి పరిచయ కార్యక్రమాలు విద్యార్థుల్లో వృత్తిపరమైన బాధ్యతను, క్రమశిక్షణను, సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ఫిజికల్ డైరెక్టర్ సునీత, డీడీవో రోడా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరువు బాధిత రైతులకు బ్యాంకుల ద్వారా ఆర్థిక ఉపశమనం





పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణ చెల్లింపు గడువు పొడిగింపునకు చర్యలు

తదుపరి వ్యవసాయ సీజన్‌కు కొత్త రుణాలు మంజూరు చేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ । నవంబర్ 4 । జై భీమ్ న్యూస్) :

కరువు ప్రభావిత మండలాల్లోని రైతులకు బ్యాంకుల ద్వారా ఆర్థిక ఉపశమన చర్యలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బ్యాంకు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశంలో కరువు బాధిత రైతులకు అందించాల్సిన ఆర్థిక సహాయంపై సమీక్షించారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, భారతీయ రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాల మేరకు అర్హులైన రైతులకు ఉపశమన చర్యలు అందించాలని సూచించారు.కరువు పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణ చెల్లింపు గడువుల పొడిగింపు, నిబంధనల ప్రకారం రుణ వాయిదాల చెల్లింపుపై మారటోరియం సదుపాయం కల్పించడంతో పాటు తదుపరి వ్యవసాయ సీజన్‌కు కొత్త పంట రుణాలు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ శాఖలు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన రైతులను గుర్తించి, వారికి వర్తించే మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత గడువులోగా ఉపశమన చర్యలు అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కిషోర్, గణేష్, యూనియన్ బ్యాంక్ డీజీఎం జి. కమలాకర్, ఆర్బీఐ ఎల్‌డీఓ యశ్వంత్, నాబార్డ్ డీడీఎం చైతన్య రవి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి. జీవన్ కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన, మత్స్యశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవే విశ్వమానవ సేవ

దివ్యాంగుల ప్రతిభకు శారీరక వైకల్యం అడ్డంకి కాదు

డాక్టర్ అనితా రెడ్డి



హనుమకొండ । నవంబర్ 4 । (జై భీమ్ న్యూస్)

దివ్యాంగుల సేవే విశ్వమానవ సేవ అని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా రాంపూర్‌లోని జీవధార ఆవరణలో ఫాదర్ జెరోమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన “దివ్యాంగులకు ఆత్మీయ స్పర్శ – సాంస్కృతిక సమ్మేళనం” కార్యక్రమానికి ఆమె విశిష్ట ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా దివ్యాంగ పిల్లలు ప్రదర్శించిన నృత్యాలు, ఆలపించిన పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయని అనితా రెడ్డి పేర్కొన్నారు. దివ్యాంగత్వం శరీరానికే తప్ప ప్రతిభకు కాదని పిల్లలు తమ ప్రదర్శనల ద్వారా నిరూపించారని కొనియాడారు.జిల్లాలోని వివిధ దివ్యాంగుల ఆశ్రమాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, పిల్లల్లో ఐక్యతను పెంపొందిస్తూ, వారికి ఆత్మీయతను పంచి, అండగా నిలిచి, వారిలోని ప్రతిభను వెలికితీసేలా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలకు అందరూ ఉన్నారనే భరోసా కల్పిస్తూ, అందరికీ కడుపునిండా భోజనం అందించి, వారు కూడా సమాజంలో అందరితో సమానమేననే సందేశాన్ని చాటిచెప్పిన ఫాదర్ జెరోమ్ సేవలు అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు.ముఖ్యంగా మానసిక దివ్యాంగుల పట్ల ప్రేమ, ఆప్యాయత, ఆత్మీయత ఎంతో అవసరమని డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. వారి హక్కులను పరిరక్షిస్తూ, వారిని ప్రేమతో అక్కున చేర్చుకున్నప్పుడే నిజమైన సేవ చేసినవారమవుతామని తెలిపారు.దివ్యాంగులకు సమాజంలోని ఇతరుల మాదిరిగానే సమాన హక్కులు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. దివ్యాంగులను గౌరవిస్తూ, ప్రేమతో ఆదరిస్తూ, సమాజంలో వారు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, ఫాదర్లు, సిస్టర్లు, తల్లిదండ్రులు, దివ్యాంగ పిల్లలు, ఇతరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో ముందుండే నాయకుడు..

ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం!

4వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు హన్మకొండ అశోక్‌కు పెద్దమ్మగడ్డ ప్రజల హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు..



పెద్దమ్మగడ్డ । నవంబర్ 4 । జై భీమ్ న్యూస్

గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ 4వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు హన్మకొండ అశోక్ ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతూ తన సేవా కార్యక్రమాలతో ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. కరోనా కష్టకాలంలో తన సొంత డబ్బులతో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు.
అదేవిధంగా కుటుంబ పెద్దల ప్రాణరక్షణకు ప్రాధాన్యమిస్తూ పలువురికి ఉచితంగా హెల్మెట్ లు పంపిణీ చేసి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం, స్నేహితులతో ఆప్యాయంగా మెలగడం, ప్రజలకు అందుబాటులో ఉండటం ఆయనలోని సేవాభావానికి నిదర్శనమని మిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పేర్కొంటున్నారు. హన్మకొండ అశోక్ జన్మదినం సందర్భంగా పెద్దమ్మగడ్డ ప్రజలు, మిత్రులు, స్నేహితులు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అశోక్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, కుటుంబంతో ఆనందంగా ఉండాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగుతూ రాజకీయంగా ఉన్నతమైన పదవులను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారు. ఆయన చేపట్టే ప్రతి సేవా కార్యక్రమం విజయవంతం కావాలని, మరెందరికో అండగా నిలుస్తూ ప్రజల ఆదరాభిమానాలను మరింతగా పొందాలని కోరుకుంటూ మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. – ప్రేమతో.. స్నేహితులు.

అల్వాల్ రైతుబజార్ను తొలగించవద్దు

మేడ్చల్, నవంబర్ 4 (జై భీమ్ న్యూస్) :

అల్వాల్ రైతుబజార్ను తొలగిస్తే 1,500 రైతు కుటుంబాలకు నష్టం కలుగుతుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ను రైతులు కలిసారు. అల్వాల్ రైతుబజార్ను ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం తొలగించనున్న నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్పై ఆధారపడిన సుమారు 1,500 రైతు కుటుంబాల జీవనోపాధిని కాపాడాలని ఎంపీ ఈటల రాజేందర్కు వినతిపత్రం అందజేశారు. మేడ్చల్, సిద్దిపేట, మెదక్, నల్గొండ జిల్లాల గ్రామాల నుంచి రైతులు ఇక్కడికి కూరగాయలు తీసుకొస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 1,000 నుంచి 1,500 మంది రైతులు, వివిధ ప్రాంతాల నుంచి కూరగాయల విక్రయాలకు వస్తున్నట్లు పేర్కొన్నారు. 1999 జనవరి 26 నుంచి సుమారు 26 ఏళ్లుగా రైతుబజార్ రైతులకు జీవనాధారంగా కొనసాగుతోందని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా వినియోగదారులకు తక్కువ ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నారని వివరించారు. రైతుబజార్ను తొలగించే పరిస్థితి ఉంటే అల్వాల్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి రైతుల జీవనోపాధిని కాపాడాలని ఈటలను విజ్ఞప్తి చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

సాగు భూముల సంరక్షణే లక్ష్యం..

ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు లాభాలు!
యాసంగిలో నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి
ఖేతీ బచావో అభియాన్‌లో వ్యవసాయ, ఉద్యానవన అధికారులు బన్న రజిత, జ్యోతి సూచన



నల్లబెల్లి । నవంబర్ 4 । జై భీమ్ న్యూస్

సాగు భూముల సంరక్షణతో పాటు యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి బన్న రజిత, ఉద్యానవన అధికారి జ్యోతి రైతులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఖేతీ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని అర్షణపల్లి, నారక్కపేట గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువులకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. పంట వ్యర్థాలను తగలబెట్టకుండా నేలలో కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంపొందించవచ్చని వివరించారు.యాసంగిలో అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా తక్కువ నీటితో పండే పెసర, మినుము, శనగ, వేరుశనగ, కుసుమ, నువ్వుల వంటి పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలను సాగు చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. నీటి పొదుపు పద్ధతులు, పంట మార్పిడి విధానాలను అనుసరించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని మెరుగైన ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలకు సాగు భూముల సారాన్ని కాపాడుతూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించడం ప్రతి రైతు బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్షణపల్లి సర్పంచ్ సిద్ధ సంతోష్, నారక్కపేట సర్పంచ్ దండెం సంపత్, వ్యవసాయ విస్తరణ అధికారులు శివకుమార్, త్రివేణి, వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌ల సర్వీస్ కాలం పెంపునకు ప్రతిపాదన!

నాలుగేళ్ల నుంచి ఆరేళ్లకు పెంచే యోచన..
శాశ్వత నియామకాల శాతం పెంచాలని త్రివిధ దళాల ప్రతిపాదన





న్యూఢిల్లీ, 4నవంబరు 2026 (జై భీమ్ న్యూస్)

భారత రక్షణ రంగంలో అమలవుతున్న అగ్నిపథ్ పథకంలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అగ్నివీర్‌ల ప్రస్తుత నాలుగేళ్ల సర్వీస్ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగించి ఆరేళ్లకు పెంచడంతో పాటు, శాశ్వత కేడర్‌లోకి తీసుకునే వారి సంఖ్యను పెంచే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.2022లో ప్రారంభమైన అగ్నిపథ్ పథకం నిబంధనల ప్రకారం నాలుగేళ్ల సర్వీస్ అనంతరం 25 శాతం మంది అగ్నివీర్‌లను మాత్రమే శాశ్వత సర్వీసులోకి తీసుకుంటారు. అయితే సైన్యం, వైమానిక దళం ఈ పరిమితిని 50 శాతానికి పెంచాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. నౌకాదళంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన సిబ్బంది అవసరాల దృష్ట్యా 70 నుంచి 75 శాతం మందిని కొనసాగించే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం.త్రివిధ దళాల్లో మొదటి విడతగా నియమితులైన అగ్నివీర్‌ల సర్వీస్ కాలం ముగింపు సమీపిస్తుండటంతో ఈ మార్పులపై చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నౌకాదళంలో మొదటి బ్యాచ్ పదవీకాలం నవంబరు 21న, వైమానిక దళంలో డిసెంబరు 21న, సైన్యంలో డిసెంబరు 31న ముగియనుంది.ఈ నేపథ్యంలో అగ్నివీర్‌ల సర్వీస్ కాలం, శాశ్వత నియామకాల శాతంపై కేంద్రం తీసుకునే నిర్ణయం కోసం రక్షణ రంగ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. ఈ నెల 21లోపు అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం.

ఉపాధి హామీ కూలీ కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం

ప్రమాదవశాత్తు మరణించిన సల్ల సమ్మయ్య కుటుంబానికి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట । నవంబర్ 4 । జై భీమ్ న్యూస్

ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సల్ల సమ్మయ్య ఉపాధి హామీ పథకం పనుల్లో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు మరణించడంతో, ఆయన కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 లక్షల ఆర్థిక సహాయం చెక్కును వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న సమ్మయ్య మరణం బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబానికి ఈ కష్టకాలంలో అండగా ఉంటామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్, ఏఎంసీ మాజీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న,



ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తూల్ల రవి, పలువురు సీనియర్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ సన్నాహక సమావేశం

వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం



వరంగల్, 4 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

ఖమ్మం--వరంగల్--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఓ సిటీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఓటరు నమోదు ప్రక్రియ, ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సందెల లాజర్, 19వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు కలకోట్ల తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో ముంపు నివారణ అసాధ్యమా.. అధికారుల నిర్లక్ష్యమా?

రెండేళ్లుగా కాలువల్లో పూడికతీత లేదు.. స్మార్ట్ సిటీ పనులపై విచారణ ఏదీ?
కార్పొరేషన్ యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాలి: దూసర్లపూడి రమణరాజు



కాకినాడ, 4 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

కాకినాడ నగరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో నగరపాలక సంస్థ యంత్రాంగం విఫలమవుతోందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు ఆరోపించారు. రెండేళ్లుగా కాలువల్లో పూడికతీత పనులు సక్రమంగా చేపట్టకపోవడం, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించకపోవడం వల్ల భారీ వర్షాలకు ఇళ్లలోకి మురుగునీరు చేరుతోందని విమర్శించారు.స్మార్ట్ సిటీ పేరుతో వెయ్యి కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఆశించిన అభివృద్ధి కనిపించడం లేదని, పనుల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రేచర్లపేట రైల్వే మేజర్ డ్రెయిన్, ఉప్పుటేరు, ఇతర ప్రధాన కాలువల్లో పూడిక తొలగించడంతోపాటు, కల్వర్టులు, రైల్వే తూములు, నీటి అవుట్‌లెట్ మార్గాలను పునరుద్ధరించాలని కోరారు.నగరంలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందని, దోమల నివారణ, చెత్త తొలగింపు, కాలువల శుభ్రత పనులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపించారు. తుఫాన్లు, భారీ వర్షాల సమయంలో ముంపు నీటిని బయటకు పంపేందుకు భారీ మోటార్లు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.గత కమిషనర్ ఐఏఎస్ అధికారి భావన బదిలీ తర్వాత కార్పొరేషన్ పాలనలో రాజకీయ జోక్యం పెరిగిందని, ప్రజా సమస్యల కంటే ఇతర ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు చేశారు. దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని, సీనియర్ ఐఏఎస్ అధికారిని పూర్తిస్థాయి కమిషనర్‌గా నియమించాలని డిమాండ్ చేశారు.గత 20 ఏళ్లలో పనిచేసిన అధికారుల ఆస్తులపై ఏసీబీ, విజిలెన్స్ విచారణ జరిపించాలని, కార్పొరేషన్‌లో అవినీతి, అసమర్థత ఆరోపణలపై చర్యలు తీసుకుని ముంపు నివారణ, పారిశుధ్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, గవర్నర్‌కు లేఖ రాసినట్లు రమణరాజు తెలిపారు.

పట్టభద్రుల ఓటు నమోదు వేగవంతం..

అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి
ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాలతో పరకాలలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు



పరకాల, 4 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

వరంగల్--నల్లగొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు వేగవంతం చేశారు. టీపీసీసీ, డీసీసీ నాయకత్వంతో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని పలువురు పట్టభద్రులను గుర్తించి, వారి ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో ఫారం-18 ద్వారా ఓటు నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ క్రమంలో పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల వద్ద పట్టభద్రుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి విజయానికి అర్హులైన ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటు హక్కు నమోదు చేయించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.పట్టభద్రులు తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు.

గ్రేటర్ వరంగల్ ఆదాయ వనరుల పెంపుపై సమీక్ష

యూజీడీ ప్రాజెక్టు సాంకేతిక అంశాలపై కేంద్ర అధికారుల ఆరా
సొంత ఆదాయం పెంచుకునే మార్గాలపై కమిషనర్ వెంకన్న వివరణ



వరంగల్ , 4 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

గ్రేటర్ వరంగల్ నగరంలో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) వ్యవస్థ ఏర్పాటుకు ఆమోదం లభించిన నేపథ్యంలో ప్రాజెక్టు అమలుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డి. తారా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. బల్దియా కమిషనర్ టి. వెంకన్న తన క్యాంపు కార్యాలయం నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూజీడీ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలు, తదుపరి కార్యాచరణపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇదే సమయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయ వనరులు, సొంత ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు ఉన్న అవకాశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై కమిషనర్ వెంకన్న ప్రస్తుతం కార్పొరేషన్‌కు సమకూరుతున్న ఆదాయ మార్గాలతో పాటు, అదనపు ఆదాయ సమీకరణకు చేపట్టదగిన చర్యలను వివరించారు. ఈ సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ కార్తిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోట్లు ఖర్చు చేసినా.. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ అస్తవ్యస్తం!

మురుగునీటిని మళ్లించాల్సిన వ్యవస్థే మురుగుతో నిండిపోయిందా?
హోటళ్లు, చికెన్ సెంటర్ల వ్యర్థాలతో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
రోడ్లపైకి మురుగునీరు.. దుర్గంధంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
కొత్త ప్రాజెక్టులపై సమీక్షలు సరే.. పాత వ్యవస్థ వైఫల్యంపై బాధ్యత ఎవరిది?



వరంగల్, 4 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

గ్రేటర్ వరంగల్ నగరంలో ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ మధ్యకాలంలో కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నేడు ఆశించిన ఫలితాలను అందించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మురుగునీటిని సక్రమంగా తరలించాల్సిన వ్యవస్థే మురుగునీటితో నిండిపోయి రోడ్లపైకి పొంగిపొర్లుతుంటే ఈ నిర్మాణాల వల్ల ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నగరంలోని పోచమ్మ మైదాన్ జంక్షన్, మండి బజార్ పరిసరాల్లో కనిపిస్తున్న పరిస్థితులు డ్రైనేజీ నిర్వహణపై అధికారుల పనితీరును ప్రశ్నించేలా చేస్తున్నాయి.

వ్యర్థాల పారబోతతో డ్రైనేజీలకు ముప్పు!

వరంగల్‌లోని బట్టల బజార్, పోస్టాఫీస్ నుంచి పోచమ్మ మైదాన్ వరకు నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పనితీరుపై స్థానికంగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మండి బజార్ పరిసరాల్లోని హోటళ్లు, చికెన్ సెంటర్లు, ఇతర దుకాణాల నుంచి వెలువడే ఆహార వ్యర్థాలు, మాంసపు వ్యర్థాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర చెత్తను డ్రైనేజీల్లో పారబోయడం సమస్యకు కారణమవుతోందనే ఆరోపణలు ఉన్నాయి. వీటితో పాటు అధికారులు ఎప్పటికప్పుడు డ్రైనేజీలను పరిశీలించి శుభ్రపరిచే చర్యలు చేపట్టకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఫలితంగా డ్రైనేజీలు వ్యర్థాలతో నిండిపోయి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. పలుచోట్ల మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు బయటకు వచ్చి రోడ్లపై ప్రవహిస్తోంది. పరిసర ప్రాంతాల్లో భరించలేని దుర్గంధం వ్యాపిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే వ్యాపార ప్రాంతాల్లో వాహనదారులు, పాదచారులు, స్థానిక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అపరిశుభ్ర వాతావరణం ప్రజారోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉన్నా సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోట్లు ఖర్చు చేసిన వ్యవస్థకు నిర్వహణ కరువైందా?

ప్రజాధనంతో నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత బల్దియా అధికారులదే. నిర్మాణం పూర్తయిన తర్వాత దాని నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయే వ్యర్థాల తొలగింపు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులు నిర్వహణ వ్యవస్థపై అనేక సందేహాలను రేకెత్తిస్తున్నాయి.డ్రైనేజీల్లో వ్యర్థాలు వేస్తున్న హోటళ్లు, చికెన్ సెంటర్లు, ఇతర దుకాణాలపై ఇప్పటివరకు ఎలాంటి పర్యవేక్షణ చేపట్టారు? నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులకు జరిమానాలు విధించారా? డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిన బాధ్యత ఏ విభాగానికి అప్పగించారు? ఎన్ని రోజులకోసారి శుభ్రపరిచే పనులు చేపడుతున్నారు? సమస్యలు తలెత్తినప్పుడు మాత్రమే స్పందిస్తున్నారా? అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

కొత్త యూజీడీకి ఆమోదం.. పాత వ్యవస్థపై సమీక్ష ఏది?

ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డి. తారా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రేటర్ వరంగల్‌లో కొత్త యూజీడీ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో బల్దియా కమిషనర్ టి. వెంకన్న పాల్గొని ప్రాజెక్టు వివరాలతో పాటు కార్పొరేషన్ సొంత ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలను వివరించారు.కొత్త ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహించడం, నగరాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం అవసరమే. అయితే ఇప్పటికే కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థలు సక్రమంగా పనిచేయకపోతే వాటి పనితీరుపై సమీక్షించాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉంది. కొత్త వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా ఇదే పరిస్థితి పునరావృతమైతే ప్రజాధనం ఖర్చు చేసినా ప్రజలకు ప్రయోజనం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతుంది.

ఇప్పటికైనా కఠిన చర్యలు చేపట్టాలి!

గ్రేటర్ వరంగల్ కమిషనర్ టి. వెంకన్న, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులు తక్షణమే పోచమ్మ మైదాన్, మండి బజార్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలి. డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి మురుగునీరు రోడ్లపైకి రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి. హోటళ్లు, చికెన్ సెంటర్లు, ఇతర దుకాణాల యజమానులతో సమావేశాలు నిర్వహించి వ్యర్థాల నిర్వహణపై స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలి. నిబంధనలు ఉల్లంఘించి డ్రైనేజీల్లో వ్యర్థాలు పారబోసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలి. అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలి.ప్రజాధనం ఖర్చు చేయడం మాత్రమే అభివృద్ధి కాదు.. ఆ నిధులతో నిర్మించిన వ్యవస్థ ప్రజలకు నిరంతరం ఉపయోగపడినప్పుడే అసలైన అభివృద్ధి! అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, నిర్వహణ, పర్యవేక్షణలో ఎక్కడ లోపం జరిగిందో అధికారులు గుర్తించాలి. సమస్యకు కారణాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. నగర ప్రజలు ఎదుర్కొంటున్న దుర్గంధం, మురుగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని వరంగల్ నగర ప్రజలు బల్దియా యంత్రాంగాన్ని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా? లేక ప్రజలు మురుగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతూనే ఉండాలా? అన్నది వేచి చూడాలి.

రాష్ట్రంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి





ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం చెల్లించాలి..
రైతులను తక్షణమే ఆదుకోవాలి
కలెక్టరేట్ ఎదుట ఎంసీపీఐ(యు) ధర్నా.. డీఆర్‌ఓకు వినతిపత్రం

హనుమకొండ, 4 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని అన్ని మండలాలను తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ఎంసీపీఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్. రెడ్డి హంసారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా హంసారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తీవ్రరూపం దాల్చాయని, వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 812.5 మిల్లీమీటర్లు ఉండగా, కేవలం 618.7 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైందని తెలిపారు. 18 జిల్లాల్లోని 331కు పైగా మండలాల్లో 24 శాతం వర్షపాతం లోటు ఏర్పడిందని, రాష్ట్రవ్యాప్తంగా 375కు పైగా మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని, 470 టీఎంసీల సామర్థ్యం కలిగిన జలాశయాల్లో ప్రస్తుతం కేవలం 170 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని వివరించారు. రాష్ట్రంలోని 21,500 సాగునీటి చెరువుల్లో కేవలం 550 చెరువుల్లో మాత్రమే నీరు ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, ముఖ్యంగా పొట్టకొచ్చిన వరి పంటకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటడం, విద్యుత్ కోతలు వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టాయని విమర్శించారు. పంట నష్టం, కరువు సహాయక చర్యలకు అవసరమైన నిధులపై సమగ్ర నివేదిక రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని, నిధులు విడుదలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

రైతులకు తక్షణ ఉపశమనం కల్పించాలి


పొట్టకొచ్చిన వరి పంటను కాపాడేందుకు అత్యవసరంగా సాగునీరు అందించాలని, రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని హంసారెడ్డి డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని సూచించారు. రబీ పంటల సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని, కౌలు రైతులను అధికారికంగా గుర్తించి వారికి కూడా పంట నష్టపరిహారం అందించాలని కోరారు.

కరువు సహాయక చర్యలు విస్తరించాలి

వివిజి రామ్ జీ పథకం ద్వారా వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు అదనపు పని దినాలు కల్పించాలని, ఉపాధి కోల్పోతున్న అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రత్యేక ఉపాధి పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కరువు పరిస్థితులను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు చేపట్టి రైతులు, వ్యవసాయ కార్మికులు, పేద కుటుంబాలకు తక్షణ ఉపశమనం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, రాజేష్ నాయక్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీపురు ఓదయ్య, జిల్లా కమిటీ సభ్యులు కుసం బుచ్చయ్య, మహమ్మద్ ఉస్మాన్, మంద భద్రయ్య, కూతురు ఇంద్రారెడ్డి, బలుగురు ప్రభాకర్ రావు, బలుగురు రాజేశ్వర్ రావు, గోనెల గోపాల్, నూతనకంటి బాబు, లడే కిషన్, బండారి మమత, మల్లికాంబ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం..

భీమవరం నుంచి ఢిల్లీ వరకు 63 ఏళ్ల మహిళ సైకిల్ యాత్ర!
లక్ష మంది విద్యార్థులకు అవగాహన కల్పించడమే ధ్యేయం
వరంగల్‌లో విజయలక్ష్మికి పోలీసుల ఘన స్వాగతం
జెండా ఊపి యాత్రను ప్రారంభించిన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత





హనుమకొండ, 4 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా 63 ఏళ్ల వయసులోనూ ఇందుపూరి విజయలక్ష్మి సాహసోపేత సైకిల్ యాత్ర చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా భీమవరం నుంచి దేశ రాజధాని ఢిల్లీ వరకు సాగుతున్న ఈ యాత్ర ద్వారా యువతకు డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'నషా ముక్త్ భారత్' పిలుపుతో స్ఫూర్తి పొందిన విజయలక్ష్మి ఈ నెల 22న భీమవరంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద యాత్రను ప్రారంభించారు. యాత్రలో భాగంగా వరంగల్‌కు చేరుకున్న ఆమెకు వరంగల్ ఈగల్ టీమ్ డీఎస్పీ రమేష్, ఇన్స్పెక్టర్ రవికుమార్, మామునూరు ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మట్టెవాడ ఇన్స్పెక్టర్ కర్ణాకర్, డ్రగ్ ఇన్వెస్టిగేషన్ సెల్ ఇన్స్పెక్టర్ సాయిరమణ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా బొల్లికుంటలోని వాగ్దేవి కళాశాలలో విద్యార్థులతో సమావేశమైన విజయలక్ష్మి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక సమస్యలను వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు కూడా అవగాహన కల్పించారు.తదుపరి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన విజయలక్ష్మి తన యాత్ర లక్ష్యాలను వివరించారు. డిసెంబర్ 10న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి యాత్ర ఉద్దేశాన్ని తెలియజేయాలని, ప్రయాణ మార్గంలో కనీసం లక్ష మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.విజయలక్ష్మి చేపట్టిన సామాజిక చైతన్య యాత్రను పోలీస్ కమిషనర్ అభినందించి, జెండా ఊపి తదుపరి ప్రయాణానికి వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్ రాజ్, సీసీఎస్ ఏసీపీ సదయ్య, మామునూరు, మట్టెవాడ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, కర్ణాకర్, డ్రగ్ ఇన్వెస్టిగేషన్ సెల్ సీఐ సాయిరమణతో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీలో అంతర్ కళాశాల క్రికెట్ పోటీలు ప్రారంభం

10 కళాశాలల జట్లతో వరంగల్ జోన్ పురుషుల క్రికెట్ టోర్నమెంట్..
ప్రతిభ ఆధారంగా కేయూ జట్టు ఎంపిక



కేయూ క్యాంపస్, 4 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాల వరంగల్ జోన్ పురుషుల క్రికెట్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో వరంగల్ జోన్ పరిధిలోని మొత్తం 10 కళాశాలలకు చెందిన క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయి.ఈ విషయాన్ని అంతర్ కళాశాల క్రీడా పోటీల ఇన్‌చార్జి డాక్టర్ ఎస్. కుమార్ వెల్లడించారు. పోటీల్లో కేయూ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఎల్.బి. కళాశాల, కేయూ క్యాంపస్ కళాశాల, మాస్టర్‌జీ కళాశాల, వాగ్దేవి డిగ్రీ కళాశాల, కిట్స్ కళాశాల, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ న్యూ సైన్స్ కళాశాల, కేజీసీ హనుమకొండ జట్లు తమ ప్రతిభను ప్రదర్శించనున్నాయి.ఈ టోర్నమెంట్ కేవలం పోటీలకే పరిమితం కాకుండా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపిక చేసే వేదికగా నిలవనుంది. వివిధ కళాశాలల నుంచి పాల్గొనే క్రీడాకారుల ఆటతీరును పరిశీలించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారితో కాకతీయ విశ్వవిద్యాలయ పురుషుల క్రికెట్ జట్టును రూపొందించనున్నట్లు స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ టి. శాస్త్రి తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెలలో నిర్వహించనున్న అంతర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది.క్రీడాకారుల ఎంపిక ప్రక్రియలో మట్టెడ కుమారస్వామి, అష్జల్ అస్లాం సెలెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో డాక్టర్ ఏ.టి.బి.టి. ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ సభ్యులు లాల్ పాషా, సుమన్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో కళాశాలల జట్లు తమ క్రీడా నైపుణ్యాన్ని చాటుకోవడంతో పాటు, విశ్వవిద్యాలయ జట్టులో స్థానం సంపాదించేందుకు పోటీపడనున్నాయి.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

కేసుల దర్యాప్తులో నైపుణ్యం పెంపొందించుకోవాలి

పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత
ఎస్సైలు, స్టేషన్ రైటర్లకు 12 రోజుల ప్రత్యేక శిక్షణ పూర్తి
ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు, రివార్డులు





వరంగల్ కమిషనరేట్, 4 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

కేసుల దర్యాప్తులో నాణ్యత, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కోర్టు వ్యవహారాల్లో సమర్థత పెంపొందించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, పోలీస్ అధికారులకు సూచించారు. నేరాలకు సంబంధించిన కేసులను పకడ్బందీగా దర్యాప్తు చేసి, నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎస్సైలు, స్టేషన్ రైటర్లకు కేసుల దర్యాప్తు, కోర్టు విధానాలపై అవగాహన, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 12 రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. అక్టోబర్ 22న ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం నవంబర్ 4 వరకు కొనసాగింది.ఈ శిక్షణలో భాగంగా కేసుల దర్యాప్తు ప్రక్రియ, నేరస్థలాల్లో శాస్త్రీయ ఆధారాల సేకరణ, సాక్షుల విచారణ, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన ఆధారాలు పొందడం, చార్జిషీట్ల తయారీ, కోర్టు విచారణ సమయంలో సాక్షుల హాజరు తదితర అంశాలపై అధికారులకు శిక్షణ అందించారు. ముఖ్యంగా సేకరించిన ఆధారాలను న్యాయస్థానంలో సమర్థవంతంగా ప్రవేశపెట్టి, కేసులను పటిష్టంగా నిరూపించే విధానాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ దర్యాప్తులో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా కేసుల విచారణపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. నేరస్థులకు శిక్షలు పడేలా పటిష్టమైన ఆధారాలు సేకరించడం, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌కు సహకరించడం పోలీసు అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.అధికారుల పనితీరు, దర్యాప్తులో కనబరిచే ప్రతిభ, కేసుల పరిష్కారంలో సాధించే ఫలితాలను ప్రాతిపదికగా తీసుకుని ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు, రివార్డులు అందజేస్తామని కమిషనర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, సీసీఆర్బీ ఏసీపీ డేవిడ్ రాజ్, సీసీఎస్ ఏసీపీ సదయ్య, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దామోదర్ రెడ్డితో పాటు పలువురు పోలీస్ అధికారులు, ఎస్సైలు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి వెంటనే ప్రత్యేక అధికారి నియమించాలి

మార్కెటింగ్ శాఖ సంచాలకుడు రాహుల్ రాజ్‌కు వినతిపత్రం సమర్పించిన మాజీ చైర్మన్ డాక్టర్ రామ్ నరసింహ గౌడ్



హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)

గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం ముగిసి 45 రోజులు గడుస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించకపోవడంపై మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమళ్ల రామ్ నరసింహ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో, తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సంచాలకుడు శ్రీ రాహుల్ రాజ్, ఐఏఎస్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి తక్షణమే ప్రత్యేక అధికారిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. పాలకవర్గం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో మార్కెట్ కమిటీ పరిపాలన, రైతులకు అందించే సేవలు, సిబ్బంది జీతభత్యాలు, పెండింగ్ పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రత్యేక అధికారి నియామక ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయాలని డాక్టర్ రామ్ నరసింహ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో భారీ నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు

- రూ.6.78 కోట్ల నకిలీ నోట్లు స్వాధీనం.. నలుగురి అరెస్టు



హైదరాబాద్, నవంబర్ 4 (జై భీమ్ న్యూస్) :

నగరంలో భారీ నకిలీ కరెన్సీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఏకంగా రూ.6.78 కోట్ల విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకుని, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న నలుగురిని అరెస్టు చేశారు. మడుపోజు కర్ణాకర్, చిన్నోళ్ల మాణిక్య రెడ్డి, చెరుకుపెల్లి రత్నాకర్ రెడ్డి, కరణ అజయ్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు చెందిన మరో ముగ్గురు పరారీలో ఉండటంతో వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నవంబర్ 1న అందిన పక్కా సమాచారంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా, అందులో రూ.8 లక్షల విలువైన నకిలీ నోట్లు బయటపడ్డాయి. కారులో నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, బొమ్మ తుపాకీ, హ్యాండ్‌గన్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా హైదరాబాద్ సమీపంలోని కుంత్లూరులో నకిలీ నోట్ల తయారీ కేంద్రం నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో అక్కడ తనిఖీలు చేపట్టిన పోలీసులు మరో రూ.6.70 కోట్ల విలువైన నకిలీ నోట్లను గుర్తించారు. నోట్ల తయారీకి ఉపయోగిస్తున్న ప్రింటర్లు, ల్యాప్‌టాప్, లామినేషన్ మెషీన్, పేపర్ కటింగ్ మెషీన్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ఈ ముఠా నకిలీ నోట్ల తయారీ కోసం యూట్యూబ్ వీడియోలు, సోషల్ మీడియాను ఆశ్రయించినట్లు వెల్లడైంది. అసలు నోట్లను స్కాన్ చేసి, కంప్యూటర్‌లో మార్పులు చేసి నకిలీ నోట్లను ముద్రించినట్లు పోలీసులు గుర్తించారు. మొదట నకిలీ నోట్లను నేరుగా మార్కెట్లో చలామణి చేసేందుకు ప్రయత్నించినప్పటికీ విఫలమయ్యారు. దీంతో ప్రజలను మోసం చేసేందుకు కొత్త పద్ధతిని ఎంచుకున్నారు. తక్కువ ధరకు ఎక్కువ మొత్తంలో నకిలీ నోట్లు ఇస్తామని ఆశ చూపుతూ వ్యక్తులను సంప్రదించేవారు. నమ్మకం కలిగించేందుకు మొదట అసలు నోట్లను చూపించి, ఆ తర్వాత డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడేవారు. ఈ మోసాలకు పోలీసుల పేరును కూడా ఉపయోగించుకున్నారు. నకిలీ నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాల్లో తిరుగుతూ, తాము పోలీసు అధికారులమని నమ్మించేందుకు నకిలీ గుర్తింపు కార్డులు, మైక్రోఫోన్లు, బొమ్మ తుపాకులను వినియోగించేవారు. నకిలీ నోట్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారిని పోలీసులమంటూ బెదిరించి, వారి వద్ద ఉన్న డబ్బును దోచుకుని పరారయ్యేవారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, షాద్‌నగర్ స్పెషల్ ఆపరేషన్స్ బృందం సంయుక్తంగా ఈ ముఠాను పట్టుకున్నాయి. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు కొనసాగుతోందని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. ఈ నకిలీ కరెన్సీ తయారీ, మోసాల వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

మార్కెట్‌లో రూ.౧,౫౦౦.. మిల్లులో రూ.8 వేలే..

ఉత్కర్ కాటన్ మిల్లులో పత్తి కొనుగోళ్లపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం



నర్వ, నవంబర్ 4 (జై భీమ్ న్యూస్) :

పత్తి పండించిన రైతుకు మార్కెట్‌లో ఆశించిన ధర దక్కడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా నర్వ మండలం పాతర్చేడు గ్రామ పరిధిలోని ఉత్కర్ కాటన్ మిల్లులో క్వింటాల్ పత్తిని రూ.8 వేలకే కొనుగోలు చేస్తున్నారని, మార్కెట్‌లో మాత్రం రూ.9,500 ధర ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మార్కెట్ ధరకు, మిల్లులో చెల్లిస్తున్న ధరకు మధ్య క్వింటాల్‌కు రూ.1,500 వ్యత్యాసం ఉండటంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టి పండిస్తే.. తక్కువ ధరకేనా?: పత్తి సాగు కోసం రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి, ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని పంటను పండిస్తున్నారని మహేశ్వర్ రెడ్డి అన్నారు. తీరా పంటను విక్రయించే సమయంలో తక్కువ ధర చెల్లిస్తే రైతులకు గిట్టుబాటు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కేలా క్వింటాల్ పత్తిని రూ.9,500 చొప్పున కొనుగోలు చేయాలని మిల్లు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మిల్లులో పత్తి తూకంలోనూ మోసం జరుగుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి కొనుగోళ్లను పర్యవేక్షించాలని, రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బి. ఆంజనేయులు, పార్టీ కార్యకర్తలు ఈ డిమాండ్లు చేశారు.

ఏబీ వెంకటేశ్వరరావుకు ఎన్నికల్లో తీవ్ర నిరాశ..

డిపాజిట్ గల్లంతు
విజయవాడ మేయర్ ఎన్నికల్లో ఏబీవీ ఘోర పరాజయం
ప్రధాన పార్టీలకు దీటుగా ప్రచారం చేసినా ఫలితం శూన్యం
వామపక్షాలు, కాంగ్రెస్ మద్దతిచ్చినా దక్కని ఓట్లు



విజయవాడ, నవంబర్ 4 (జై భీమ్ న్యూస్) :

విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర నిరాశ ఎదురైంది. ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన... తాను ఎదుర్కొన్న తొలి ఎన్నికల్లోనే చేదు అనుభవాన్ని మూటగట్టుకున్నారు. విజయవాడ మేయర్ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చవిచూశారు. ప్రధాన పార్టీలకు దీటుగా విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించినప్పటికీ, ఆయన కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మద్దతుతో బరిలోకి దిగిన ఆయన, ఓట్ల సాధనలో మాత్రం పూర్తిగా వెనకబడ్డారు.నగరంలోని మూడు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేపట్టిన ఏబీ వెంకటేశ్వరరావు గౌరవప్రదమైన ఓట్లు సాధించడంలో పూర్తిగా విఫలమయ్యారు. అర్ధరాత్రి 1.30 గంటలకు వెలువడిన ఫలితాల్లో ఆయనకు కేవలం 11,137 ఓట్లు మాత్రమే సాధించారు. ఈ ఫలితాలు వామపక్షాల ఓటు బ్యాంకు కూడా ఆయనకు బదిలీ కాలేదనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కూటమిగా ఏర్పడి మద్దతు ప్రకటించినా, ఆ ఓట్లు ఏబీవీకి పడకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రచారంలో చూపిన జోరు, ఫలితాల్లో కనిపించకపోవడంతో ఆయన వర్గీయులు నిరాశ చెందారు.

కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీళ్లివ్వడం లేదు: వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 4 (జై భీమ్ న్యూస్) :

తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన కరవని ఆయన విమర్శించారు. పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో కూడిన ప్రతినిధి బృందం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది. ఈ సందర్భంగా బ్యారేజీ స్థితిగతులను, నీటి లభ్యతను వారు పరిశీలించారు.అనంతరం వేముల ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. బ్యారేజీ వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఉద్దేశపూర్వకంగా సముద్రం పాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యం సుమారు 22,000 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని, ఈ నీటిని పంపింగ్ చేస్తే రైతుల పంటలను కాపాడవచ్చని ఆయన అన్నారు. బ్యారేజీ కూలిపోయిందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, 85 పిల్లర్లు పటిష్ఠంగానే ఉన్నాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున 'రైతు పోరుబాట' నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భారత్‌లో పేదరికం తగ్గుదల

దశాబ్ద కాలంలో గణనీయమైన మార్పు

49.6 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు

ఆర్థిక అసమానతలు మాత్రం అలాగే

ఉపాధి పెరుగుదలలో మహిళల పాత్ర

యువతలో పెరుగుతున్న నిరుద్యోగం

భారత్‌లో అంత పేదరికం తగ్గిందా... దశాబ్ద కాలంలో ఆర్థిక, ఆర్థికేతర అంశాల్లో పేదరికాన్ని తగ్గించడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా పేదరికాన్ని తగ్గిస్తున్న దేశాల్లో భారత్ కూడా ఒకటని ఆ నివేదిక పేర్కొంది. 'భారత్‌లో పేదరికం, సమానత్వం' పేరుతో ప్రపంచ బ్యాంక్ ఈ నివేదిక విడుదల చేసింది. దారిద్ర్య రేఖకు దిగువన అంటే రోజుకు 4.2 డాలర్ల (సుమారు రూ. 399) కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న జనాభా శాతం 2011 నుంచి 2023 మధ్య 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గింది" అని నివేదికలో ప్రపంచ బ్యాంక్ తెలిపింది. ఈ కాలంలో 49.6 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. అదే సమయంలో తీవ్ర పేదరికంలో అంటే రోజుకు 3 డాలర్ల (సుమారు రూ. 285) కంటే తక్కువ ఆదాయంతో నివసిస్తున్న జనాభా 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గింది" అని వెల్లడించింది. భారత్‌లో పేదరికం తగ్గడం కొనసాగుతుందని, అయితే ఈ తగ్గుదల వేగం కొంత నెమ్మదించవచ్చని అంచనా వేస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు పేర్కొంది. రోజుకు రూ. 399 ఆదాయాన్ని దారిద్ర్య రేఖగా గుర్తిస్తే 2026లో 14.2 శాతంగా ఉన్న పేదరికం రేటు 2028 నాటికి 12.1 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసింది. "ఆర్థికేతర ప్రమాణాల ఆధారంగా పేదరికాన్ని అంచనా వేయడానికి ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ (ఓపీహెచ్ఐ) రూపొందించిన మల్టీడైమన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపీఐ) ఆధారంగా అంచనా వేస్తారు. 2005-06లో పేదరికం రేటు 53.8 శాతంగా ఉండగా, అది 2019-21 నాటికి 16.4 శాతానికి తగ్గింది. 2022-23లో ఈ రేటు 15.5 శాతంగా ఉందని ప్రపంచ బ్యాంకు బహుముఖ పేదరిక సూచీ తెలిపింది. భారత్‌లో పేదరికం తగ్గుతున్నప్పటికీ ఆర్థిక అసమానతలు పెరుగుతున్న సమస్య మాత్రం అలాగే ఉంది. "నిజానికి ప్రజలు ఎంత ఖర్చు చేస్తున్నారనేదాని ఆధారంగా అసమానతలను లెక్కిస్తే అవి చాలా తక్కువగా కనిపిస్తాయి. ఆదాయాలను పోల్చి చూస్తే అసమానత చాలా ఎక్కువగా ఉంటుంది" అని ఇండియా టుడే నిర్వహించిన కార్యక్రమంలో ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా చెప్పారు. "భారత్‌లో ప్రజల ఆదాయాలకు సంబంధించి అసలు సర్వేలే నిర్వహించడం లేదు. మన దేశంలో ఆర్థిక అసమానతలు చాలా తీవ్రమైన సమస్య. అది మరింత తీవ్రమైంది. మనం దీనిని నిర్లక్ష్యం చేయకూడదు" అని ఆయన అన్నారు. ప్రపంచ బ్యాంక్ నివేదికలోని అంశాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్వాగతించారు. నివేదిక గణాంకాల్లోని సానుకూల అంశాలను సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌లో ఆమె ప్రస్తావించారు. "ప్రజల వినియోగం గణనీయంగా పెరగడం, ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం, ఆహార సబ్సిడీతో పాటు సామాజిక సంక్షేమ పథకాల విస్తరణ వంటివి పేదరికం తగ్గడానికి ప్రధాన కారణాలని ప్రపంచ బ్యాంకు గుర్తించింది" అని నిర్మలా సీతారామన్ అన్నారు. "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం అమలు చేస్తున్న విధానపరమైన ప్రయత్నాలు స్పష్టమైన ఫలితాలను ఇస్తున్నాయి. దీంతో అందరికీ అభివృద్ధి ఫలాలు అందించే సమ్మిళిత వృద్ధికి, ప్రజలకు మరిన్ని ఆర్థిక అవకాశాలు కల్పించడానికి బలమైన పునాది ఏర్పడుతోంది" అని ఆమె విశ్లేషించారు. పేదరికం తగ్గినప్పటికీ కొన్ని వర్గాల కుటుంబాల్లో ఇప్పుడది ఎక్కువగా కనిపిస్తోందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది. విద్యాస్థాయి తక్కువగా ఉన్నవాళ్లు, ఆస్తులు తక్కువగా ఉన్నవాళ్లు, స్థిరమైన ఉపాధి పొందే అవకాశాలు పరిమితంగా ఉన్నవాళ్లు, కుటుంబ పోషణ భారం ఎక్కువగా ఉన్నవాళ్ల కుటుంబాల్లో పేదరికం ఎక్కువగా ఉందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది. కూలీల వేతనాల మధ్య అసమానతలు ఇప్పటికీ చాలా ఎక్కువగా ఉన్నాయని నివేదిక తెలిపింది. 2023లో అత్యధిక వేతనాలు పొందుతున్న పది శాతం కార్మికుల సగటు వేతనం, అతి తక్కువ వేతనాలు పొందుతున్న 10 శాతం కార్మికుల సగటు వేతనం కంటే దాదాపు 13 రెట్లు ఎక్కువగా ఉంది" అని నివేదిక పేర్కొంది. "కొన్ని ప్రత్యేక భౌగోళిక ప్రాంతాల్లో పేదరికం ఎక్కువగా ఉందని కూడా నివేదిక పేర్కొంది. చాలా రాష్ట్రాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పటికీ దేశంలోని మొత్తం పేద జనాభాలో సుమారు 57 శాతం జనాభా ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు విరుసగా ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తోంది" అని నివేదిక పేర్కొంది. 2017 నుంచి 2023 మధ్యకాలంలో ఉద్యోగాలు, ఉపాధి పొందుతున్నవాళ్ల సంఖ్య సుమారు 13.4 కోట్లు పెరిగిందని కూడా నివేదిక పేర్కొంది. పని చేసే వయసులో ఉన్న జనాభా పెరుగుదలతో పోలిస్తే ఉపాధి పొందుతున్న వారి సంఖ్య దాదాపు రెట్టింపు పెరిగింది. ఈ ఉపాధి పెరుగుదలలో ఎక్కువ భాగం గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు జీతం వచ్చే పనుల్లో చేరడం వల్లే సాధ్యమైంది. దీనివల్ల కుటుంబంలో సంపాదించే సభ్యుల సంఖ్య పెరిగింది. అయితే యువతలో నిరుద్యోగం పెరిగిన విషయాన్ని కూడా ప్రపంచ బ్యాంక్ ప్రత్యేకంగా ప్రస్తావించింది. 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నుంచి 2027-28 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం మధ్య యువతలో నిరుద్యోగ రేటు 14.6 శాతం నుంచి 15.9 శాతానికి పెరిగింది. ఈ ప్రభావం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువతులపై ఎక్కువగా పడిందని నివేదిక తెలిపింది. అంతేకాకుండా ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత లెక్కించే వాస్తవ వేతనాల్లో పెద్దగా మార్పులేదని నివేదిక పేర్కొంది. అదే సమయంలో ఉపాధి పెరిగినప్పటికీ ఎక్కువ ఉత్పాదకత లేని పనుల్లోనే ఈ పెరుగుదల ప్రధానంగా కనిపించిందని తెలిపింది.

జగన్‌కు ఎన్నికల ఊరట

క్యాడర్‌లో కొత్త ఉత్సాహం నింపిన స్థానిక ఎన్నికలు

పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తెచ్చిన వ్యూహం

ఓటమి తర్వాత పార్టీ ఉనికిని చాటుకునే ప్రయత్నం

ఎన్నికలపై జగన్ తీవ్ర ఆరోపణలు

సొంత ఇలాకాలోనే వైసీపీకి ఘోర పరాజయం



అనంతపురం, నవంబర్ 4 (జై భీమ్ న్యూస్) :

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ వ్యూహం ఒకరకంగా విజయవంతమైనట్లేనని చెప్పాలి. ఎందుకంటే గత ఎన్నికల తరహాలో ఎన్నికలను బహిష్కరించకుండా క్యాడర్‌లను, లీడర్లను ఎన్నికల బరిలోకి దింపడంతో ఒకరకంగా జగన్ సక్సెస్ అయినట్లే. తన క్యాడర్‌ను పార్టీ జెండా పట్టుకుని వచ్చే సాధారణ ఎన్నికల వరకూ పోరాడగలిగేలా జగన్ ఈ ఎన్నికల ద్వారా సమాయత్తం చేయగలిగారు. నామినేషన్ల పర్వం నుంచి మొదలైన రగడతో క్యాడర్ స్ట్రాంగ్‌గా మారింది. ఎన్నికల ఫలితాల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని చాటుకోవడం మరియు క్యాడర్‌ను యాక్టివ్ చేయడంలో ఈ ఎన్నికలు కీలక పాత్ర పోషించాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత సాధారణ ఎన్నికల్లో వైసీపీ కేవలం పదకొండు స్థానాలకే పరిమితం కావడంతో క్యాడర్, లీడర్లలో నైరాశ్యం నిండుకుంది. కొందరైతే పార్టీని వీడి వెళుతున్నవారు, మరికొందరు తమ ఇళ్లకే పరిమితమైనవారితో ఫ్యాన్ పార్టీ ఉక్కపోతకు గురయిందని చెప్పాలి. అయితే స్థానిక సంస్థల ఎన్నికలను జగన్ చక్కగా వినియోగించుకున్నాడనిపిస్తోంది. స్తబ్దుగా ఉన్న క్యాడర్, లీడర్లలో ఆత్మస్థైర్యం నింపింది. కొన్ని చోట్ల ప్రజలు వైసీపీకి పట్టం కట్టడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కూటమికి ఏకపక్షం కాదని ఈ ఎన్నికల ద్వారా జగన్ రుజువు చేసినట్లయింది. సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత స్తబ్దుగా ఉన్న పార్టీ శ్రేణుల్లో ఈ ఎన్నికలు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. నాయకత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని జగన్ కల్పించగలిగారు. పార్టీలోని అగ్రనాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు మరియు కార్యకర్తలు అంతా కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరాన్ని ఈ ఎన్నికలు గుర్తుచేశాయి. దీనివల్ల అంతర్గత విభేదాలు పక్కన పెట్టి అందరూ ఏకమయ్యే పరిస్థితి వచ్చింది. పోరాట పటిమను చాటడం: ఓటమిని చూసి కుంగిపోకుండా, అధికార పక్షాన్ని ఎదుర్కొంటూ ఎన్నికల బరిలో నిలవడం ద్వారా వైసీపీ తన ఉనికిని బలంగా చాటుకోగలిగింది. స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని పునర్నిర్మించుకోవడానికి, లోపాలను సరిదిద్దుకోవడానికి జగన్‌కు ఒక మంచి అవకాశం లభించింది. రాజకీయాల్లో గెలుపు ఎంత ముఖ్యమో... ఓడినప్పుడు క్యాడర్ చేజారిపోకుండా కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. ఆ కోణంలో చూస్తే, క్లిష్ట పరిస్థితుల్లో కూడా లీడర్లను, క్యాడర్‌ను ఏకతాటిపైకి తీసుకురావడంలో జగన్ వ్యూహం విజయవంతమైందని చెప్పవచ్చు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పటికీ, పార్టీ శ్రేణులు మరియు నాయకత్వం కలిసికట్టుగా ఉండటం జగన్ మోహన్ రెడ్డి సాధించిన విజయంగా కొందరు భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై వైసీపీ అధినేత జగన్ ట్వీట్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు టీమ్, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకూ అంతా హైజాక్ చేశారని జగన్ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇది ఎన్నిక కాదని... ఇది ఎన్నిక కాదని, అధికార పార్టీ ఎంపిక మాత్రమేనని వైఎస్ జగన్ అన్నారు. ప్రజలు అభ్యర్థులను ఎన్నుకోలేదని, ఎంపిక మాత్రమేనని అన్నారు. ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే దక్కనివ్వకుండా అధికార పార్టీ ఈ విజయాన్ని అందిపుచ్చుకుందని జగన్ అన్నారు. ప్రతిపక్షానికి అవకాశమివ్వకుండా అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎలాగో నిరూపించారు. క్లిష్ట సమయాల్లో కూడా క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు కోల్పోకుండా, భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావడంలో నాయకత్వం విజయవంతమైందని ఈ వర్గం విశ్లేషిస్తుంది. భేదాభిప్రాయాలు మరియు సవాళ్లను ఎత్తిచూపే వాదన: మరోవైపు, ఎన్నికల తర్వాతి పరిణామాలలో కొందరు కీలక నాయకులు పార్టీని వీడటం లేదా క్రియాశీల రాజకీయాలకు దూరం కావడం వంటి అంశాలను మరికొందరు గుర్తుచేస్తున్నారు. పార్టీని తిరిగి బలోపేతం చేయడానికి మరియు క్యాడర్‌లో పూర్తిస్థాయి నమ్మకాన్ని నింపడానికి ఇంకా చాలా శ్రమించాల్సి ఉందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. జగన్ ఇలాకాలో ఓటమి: కడప జిల్లాలో వైసీపీకి ఘోర పరాజయం దక్కింది. మొత్తం ఎనిమిది మున్సిపాలిటీల్లో వైసీపీ ఓటమి చవిచూసింది. ఉమ్మడి కడప జిల్లాలో దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో వైసీపీ ఓటమి పాలయింది. బద్వేల్, రాజంపేట, మైదుకూరు, ప్రొద్దుటూరులో వైసీపీ ఓటమి చెందింది. అన్ని చోట్ల ఓటమి... కమలాపురం, జమ్మలమడుగు, యర్రగుంట్లలో వైసీపీకి పరాభవం ఎదురయింది. పులివెందుల మున్సిపాలిటీలోనూ వైసీపీకి ఘోర ఓటమి చవిచూసింది. మొత్తం మీద అన్ని చోట్ల పోటీ చేసిన వైసీపీకి ఘోర పరాభవం ఎదురుకావడాన్ని ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు.

అమెరికా ఎన్నికల్లో భారతీయుల హవా



కాంగ్రెస్‌పై పట్టు కోసం మధ్యంతర ఎన్నికలు

కీలక పదవుల కోసం భారత సంతతి నేతల పోటీ

వర్జీనియా నుంచి సుహాస్ సుబ్రమణ్యం తిరిగి ఎన్నిక

ఒహాయో గవర్నర్ రేసులో వెనుకంజలో వివేక్ రామస్వామి

ఫ్లోరిడాలో పియా దండియా ఆధిక్యం.. పలుచోట్ల ఫలితాలపై ఉత్కంఠ

అమెరికా మధ్యంతర ఎన్నికలు.. సత్తా చాటుతున్న భారత సంతతి అభ్యర్థులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలంలోని చివరి రెండేళ్లలో కాంగ్రెస్‌పై ఎవరికి పట్టు ఉంటుందో తేల్చే మధ్యంతర ఎన్నికల పోలింగ్ మంగళవారం ముగిసింది. దేశవ్యాప్తంగా ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, 100 మంది సభ్యులున్న సెనెట్‌లోని 37 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటితో పాటు 36 రాష్ట్రాల్లో గవర్నర్ పదవులకు కూడా ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో భారత సంతతికి చెందిన అభ్యర్థులు కీలక పదవుల కోసం పోటీ పడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన డెమోక్రటిక్ నేత సుహాస్ సుబ్రమణ్యం ఘన విజయం సాధించారు. వర్జీనియాలోని 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి పోటీ చేసిన ఆయన, 61 శాతానికి పైగా ఓట్లు సాధించి ప్రతినిధుల సభకు తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి డేవ్ బెక్‌విత్‌కు 36 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. గతంలో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వైట్‌హౌస్‌లో టెక్నాలజీ పాలసీ సలహాదారుగా సుహాస్ పనిచేశారు. అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఒహాయో గవర్నర్ పదవికి రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడుతున్న భారత సంతతి వ్యాపారవేత్త వివేక్ రామస్వామి ప్రస్తుతం వెనుకంజలో ఉన్నారు. కేరళ మూలాలున్న వివేక్‌కు అధ్యక్షుడు ట్రంప్ మద్దతు ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం, ఆయన తన ప్రత్యర్థి, డెమోక్రటిక్ అభ్యర్థి అవి యాక్టన్ కంటే దాదాపు 2,00,000 ఓట్ల వెనుకంజలో ఉన్నారు. మరోవైపు ఫ్లోరిడా 22వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డెమోక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పియా దండియా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ అయిన ఆమె, రిపబ్లికన్ అభ్యర్థి కేసీ అస్కర్‌పై దాదాపు 11,000 ఓట్ల ఆధిక్యంతో ముందంజలో ఉన్నారు. సిలికాన్ వ్యాలీలోని కొన్ని ప్రాంతాలున్న కాలిఫోర్నియా 17వ డిస్ట్రిక్ట్‌లో ఇద్దరు భారత సంతతి నేతల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. ఇక్కడ డెమోక్రటిక్ కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నాపై రిపబ్లికన్ నేత రితేష్ టాండన్ పోటీ చేస్తున్నారు. అలాగే వాషింగ్టన్‌లోని 7వ డిస్ట్రిక్ట్‌లో సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీలా జయపాల్‌పై మరో భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నేత నీరవ్ సేథ్ బరిలో ఉన్నారు. ఈ రెండు చోట్ల ఫలితాలు ఇంకా వెలువడలేదు. వీరితో పాటు సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యుడు అమీ బేరా (కాలిఫోర్నియా), అమిష్ షా (అరిజోనా), పూజా సేథి (టెక్సాస్), సందీప్ శ్రీవాస్తవ (టెక్సాస్) వంటి అనేకమంది భారత సంతతి అభ్యర్థులు వివిధ స్థానాల నుంచి పోటీ పడుతున్నారు. లాస్ ఏంజిల్స్ నగర మేయర్ పదవికి నిత్యా రామన్ పోటీ చేస్తున్నారు. ఆమె గెలిస్తే, అమెరికాలోని రెండు అతిపెద్ద నగరాలైన న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌కు భారత సంతతికి చెందినవారే మేయర్లుగా ఉంటారు. కొన్ని చోట్ల ఫలితాలు వెలువడినప్పటికీ, పలువురు కీలక భారత సంతతి అభ్యర్థుల భవితవ్యం తేలాల్సి ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మెహిదీపట్నం హోటల్లో అగ్నిప్రమాదం

నూడుల్స్ తయారీ ప్రాంతంలో చెలరేగిన మంటలు..

ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసిన సిబ్బంది..

హైదరాబాద్, నవంబర్ 4 (జై భీమ్ న్యూస్) :

మెహిదీపట్నంలోని కింగ్స్ రెస్టారెంట్లో రాత్రి 11:40 గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. హోటల్‌లో నూడుల్స్ తయారుచేసే ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సిబ్బంది అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది లంగర్ హౌస్, అంబర్‌పేట నుంచి ఫైర్ ఇంజన్లను ఘటనా స్థలానికి తరలించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉండగా, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

నా శాపం నుంచి ఎవరూ తప్పించుకోలేరు: కేఏ పాల్

ట్రంప్ ఓటమితో ప్రపంచానికి మేలు జరుగుతుంది

యుద్ధ పిపాసులకు ప్రజలే బుద్ధి చెబుతారు

నెతన్యాహూకూ ఇదే పరిస్థితి వస్తుంది

మతం పేరుతో గొడవలు సృష్టించేవారికి హెచ్చరిక

భారత్‌కు తిరిగొచ్చాక ఒక్కొక్కరి తాట తీస్తా

హైదరాబాద్, నవంబర్ 4 (జై భీమ్ న్యూస్) :

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఓటమి చెందితే ప్రపంచానికి మేలు జరుగుతుందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. యుద్ధాలను ప్రోత్సహించే నేతలకు ప్రజల చేతిలో ఓటమి తప్పదని వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ పరిస్థితి కూడా ఇలాగే మారుతుందని పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధాన్ని ఆపకపోతే మాజీ స్పీకర్‌గా మారతావంటూ అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్‌ను తాను హెచ్చరించినట్లు వెల్లడించారు. కళ్లు నెత్తికెక్కిన రాజకీయ నాయకులకు ఇలాంటి పరిణామాలే ఎదురవుతాయని అన్నారు. ప్రస్తుత ప్రపంచంలో ట్రంప్ కంటే శక్తిమంతమైన నాయకుడు మరొకరు లేరని, అయినప్పటికీ ఎన్ని బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చినా ఆయన వ్యవహారశైలిని తాను వ్యతిరేకిస్తూనే వచ్చానని కేఏ పాల్ తెలిపారు. తన వ్యాఖ్యలు భారతదేశంలోని ముఖ్యమంత్రులు, ఇతర రాజకీయ నాయకులకు కూడా హెచ్చరికగా భావించాలని పేర్కొన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య గొడవలు సృష్టించేవారు తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. బైబిల్ పంపిణీ చేసినందుకు మహిళలపై దాడులు జరిగినప్పటికీ ఇప్పటివరకు బాధ్యులను అరెస్టు చేయలేదని ఆరోపించారు. తాను భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత ఈ వ్యవహారంలో బాధ్యులైన ఒక్కొక్కరి సంగతి చూస్తానని హెచ్చరించారు. తాను శపిస్తే ఎవరూ ఆ శాపం నుంచి తప్పించుకోలేరని కేఏ పాల్ వ్యాఖ్యానించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

‘పాకెట్ రాకెట్స్’తో మీ ఇంట్లోకి వచ్చేస్తాం: నిహారిక



డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు ‘పాకెట్ రాకెట్స్’

గ్యాంబ్లింగ్ నేపథ్యంలో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్

నిహారిక లాంటి గొప్ప నిర్మాతను చూడలేదు: జేడీ చక్రవర్తి

ఆరు నెలల్లోనే సినిమా పూర్తి చేశాం: నిహారిక

ఇద్దరు యువకుల జీవితాల చుట్టూ కథాంశం

సినిమా డెస్క్:

హైదరాబాద్: పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, మాక్సిమం సిటీ స్టూడియోస్ సంస్థల సంయుక్త నిర్మాణంలో తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘పాకెట్ రాకెట్స్’ డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, రాహుల్ రాఘవేంద్ర, రాహుల్ నిమ్మకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రుద్ర అత్రి దర్శకత్వం వహిస్తున్నారు. త్రినాథ్ వర్మ (కమిటీ కుర్రోళ్లు ఫేమ్), నిర్మల్ (డెబ్యూ) హీరోలుగా, శ్రియా కొంతం (శుభం ఫేమ్) కథానాయికగా నటిస్తుండగా, జేడీ చక్రవర్తి కీలక పాత్ర పోషిస్తున్నారు. గ్యాంబ్లింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా నుంచి ‘ది ఫస్ట్ హ్యాండ్’ పేరుతో మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ, జులైలో సినిమాను ప్రారంభించామని, దర్శకుడు రుద్రతో తమకు ఎన్నో ఏళ్లుగా పరిచయం ఉందని తెలిపారు. టీజర్ అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, అంజి, ఏసు, జేడీ చక్రవర్తి పాత్రలు అద్భుతంగా ఉంటాయని చెప్పారు. కేవలం ఆరు నెలల్లోనే చిత్రాన్ని పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేశామని, డిసెంబర్ 11న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని పేర్కొన్నారు. సినిమా విడుదల వరకు తామంతా సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకుల ఇంట్లోకి వచ్చేస్తామని సరదాగా వ్యాఖ్యానించారు. నటుడు జేడీ చక్రవర్తి మాట్లాడుతూ, అక్టోబర్‌లో ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నానని, నవంబర్‌లో టీజర్ విడుదల చేసి డిసెంబర్‌లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. తన సినీ జీవితంలో నిహారిక లాంటి గొప్ప నిర్మాతను చూడలేదని ప్రశంసించారు. మన్యం రమేష్ సినిమా స్థాయిని పెంచారని, దర్శకుడు రుద్ర ఎంత గొప్పగా సినిమాను తెరకెక్కించారో థియేటర్లలోనే చూడాలని ప్రేక్షకులను కోరారు. నిర్మాత రాహుల్ రాఘవేంద్ర మాట్లాడుతూ, ఇప్పటివరకు డిజిటల్ కంటెంట్ రూపొందించిన తమకు ఇది తొలి సినిమా అని, నిహారికతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. దర్శకుడు చెప్పిన కథ తమకు ఎంతో నచ్చిందని, ప్రేక్షకులు తమ ఫోన్లను పక్కనపెట్టి రెండు గంటల పాటు ఆసక్తిగా చూసేలా సినిమా ఉంటుందని తెలిపారు. దర్శకుడు రుద్ర అత్రి మాట్లాడుతూ, టీజర్ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నానని, తనకు అండగా నిలిచిన నిహారికతో పాటు చిత్రబృందంలోని ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. టీమ్ సహకారంతోనే తక్కువ సమయంలో సినిమాను పూర్తి చేయగలిగానని చెప్పారు. సంగీత దర్శకుడు గ్యానీ మాట్లాడుతూ, సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారని, చిత్రం అద్భుతంగా వచ్చిందని పేర్కొంటూ డిసెంబర్ 11న విడుదలయ్యే సినిమాకు ప్రేక్షకులు మద్దతు ఇవ్వాలని కోరారు. హీరో త్రినాథ్ వర్మ మాట్లాడుతూ, ఈ సినిమాలో అంజి అనే యువకుడి పాత్రలో కనిపిస్తానని, జీవితాన్ని మార్చుకోవాలని, మంచి అవకాశం కోసం ఎదురుచూసే కుర్రాడి పాత్ర తనకు ఎంతో దగ్గరగా అనిపించిందన్నారు. తనను మళ్లీ హీరోగా నిలబెట్టిన నిహారిక, మన్యం రమేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇద్దరు యువకులు తమ జీవితాలను బాగు చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేశారన్నదే ఈ సినిమా కథాంశమని వెల్లడించారు. జేడీ చక్రవర్తితో కలిసి పనిచేయడం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, తనకు సహకరించిన రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపారు. హీరో నిర్మల్ మాట్లాడుతూ, ‘పాకెట్ రాకెట్స్’ తన తొలి చిత్రమని, తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన నిహారిక, రుద్రలకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సినిమా ద్వారా ఎంతో నేర్చుకున్నానని, ప్రేక్షకుల ఆదరణ కోరారు. కథానాయిక శ్రియా కొంతం మాట్లాడుతూ, ఈ చిత్రంలో హారిక పాత్రలో కనిపిస్తానని, ఆ పాత్ర ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నిహారిక నిర్మాణంలో, దర్శకుడు రుద్ర తొలి సినిమాలో నటించడం ఆనందంగా ఉందని, టీజర్ కంటే పది రెట్లు బాగుంటుందని సినిమా గురించి తెలిపారు. ఎడిటర్ అన్వల్ అలీ మాట్లాడుతూ, నిహారిక విభిన్నమైన కథాంశాలతో సినిమాలను నిర్మిస్తున్నారని, ‘పాకెట్ రాకెట్స్’ ఎంతో ఎనర్జిటిక్‌గా ఉంటుందని చెప్పారు. డిసెంబర్ 11న విడుదల కానున్న ఈ చిత్రంలో త్రినాథ్ వర్మ, శ్రియా కొంతం, నిర్మల్, జేడీ చక్రవర్తితో పాటు శ్రీనివాస్ అవసరాల, శ్రీనివాస్ వడ్లమాని, కిరీటి దామరాజు తదితరులు నటిస్తున్నారు.

‘పాకెట్ రాకెట్స్’ టీజర్‌తో పెరిగిన క్యూరియాసిటీ

‘ది ఫస్ట్ హ్యాండ్’ పేరుతో టీజర్ విడుదల

గ్యాంబ్లింగ్ నేపథ్యంలో ఆసక్తికర కథనం

శ్రీలంక నేపథ్యంలో ఇద్దరు యువకుల సాహసాలు

కీలక పాత్రలో జేడీ చక్రవర్తి

పూర్తయిన షూటింగ్.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు షురూ



హైదరాబాద్: నిహారిక కొణిదెలకు చెందిన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, మాక్సిమం సిటీ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘పాకెట్ రాకెట్స్’ సినిమా టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ‘ది ఫస్ట్ హ్యాండ్’ పేరుతో మేకర్స్ మంగళవారం విడుదల చేసిన ఈ టీజర్‌లో శ్రీలంకలోని ఓ అందమైన రిసార్ట్‌లో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న యువకుడు ‘ఈ ఫీలింగ్ ఏంట్రా ఇలా ఉంది.. కల కంటే రియాలిటీనే ఫస్ట్ టైమ్ బావుంది’ అంటూ చెప్పే డైలాగ్ ఆకట్టుకుంటోంది. దీనికి మరో యువకుడు ‘డోంట్ టాక్ టు మీ తెలుగు లైక్ లోకల్ బస్తీ గయ్స్.. ఐయామ్ ది ఓనర్ ఆఫ్..’ అంటూ బదులివ్వడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అనంతరం గ్యాంబ్లింగ్ జరిగే ప్రదేశాన్ని పరిచయం చేస్తూ కథపై క్యూరియాసిటీ పెంచారు. బస్తీలో నివసిస్తూ చదువుకుంటూ జీవితాన్ని నెట్టుకొచ్చేందుకు ఎన్నో కష్టాలు పడే ఇద్దరు యువకుల జీవితాల్లోకి ఓ అందమైన అమ్మాయి ప్రవేశించిన తర్వాత ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయన్నదే ఈ చిత్ర కథాంశంగా తెలుస్తోంది. జీవితంలో ఎప్పటికైనా మంచి స్థాయికి చేరుకోవాలని కలలు కనే ఆ ఇద్దరు స్నేహితులను ఆ అమ్మాయి శ్రీలంకకు ఎందుకు పంపిస్తుంది? అక్కడికి వెళ్లిన తర్వాత వారి జీవితాలు ఎలాంటి మలుపులు తిరుగుతాయి? అన్న అంశాలను ఆసక్తికరంగా తెరకెక్కించినట్లు టీజర్ సూచిస్తోంది. విదేశాల్లో చదువుకోవాలనే కలను నెరవేర్చుకునేందుకు ఓ యువకుడు గ్యాంబ్లింగ్‌లోకి అడుగుపెట్టడం, అక్కడ జేడీ చక్రవర్తి పాత్ర పరిచయం కావడం, ఆ తర్వాత చోటుచేసుకునే కీలక పరిణామాలు టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. నిహారిక కొణిదెల పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, మాక్సిమం సిటీ స్టూడియోస్ సంస్థలపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి రుద్ర అత్రి దర్శకత్వం వహిస్తున్నారు. పద్మజ కొణిదెల, రాహుల్ రాఘవేంద్ర, రాహుల్ నిమ్మకూరి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. త్రినాథ్ వర్మ (కమిటీ కుర్రోళ్లు ఫేమ్), నిర్మల్ (డెబ్యూ హీరోలు), శ్రియా కొంతం (శుభం ఫేమ్) కథానాయికగా, జేడీ చక్రవర్తి కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ పూర్తవగా, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రానికి ఎదురోలు రాజు సినిమాటోగ్రాఫర్‌గా, అన్వల్ అలీ ఎడిటర్‌గా పనిచేస్తుండగా, గ్యానీ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమాలో శ్రీనివాస్ అవసరాల, శ్రీనివాస్ వడ్లమాని, కిరీటి దామరాజు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

‘దొంగ నా కొడుకు’లో క్యూట్ బబ్లీ క్యారెక్టర్

కొత్త స్వరం – హైదరాబాద్:



‘దొంగ నా కొడుకు’ సినిమాలో తాను క్యూట్ అండ్ బబ్లీ, కొంచెం తింగరి పాత్రలో నటించానని హీరోయిన్ సుష్మితా శెట్టి తెలిపారు. ఈ సినిమాలో ఈశ్వర్‌ను ప్రేమిస్తూ, అతడి కోసం ఏదైనా చేసే అమ్మాయిగా కనిపిస్తానని, తన తెలివితేటలు ఒక్కోసారి ఇన్నోసెంట్ కామెడీగా మారుతాయని చెప్పారు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన తాను శ్రీదేవిని స్ఫూర్తిగా తీసుకుని, చిన్నప్పటి నుంచి డ్యాన్స్‌పై ఆసక్తితో నటన వైపు వచ్చానని, ‘జగమే సంగీతం’ వెబ్‌సిరీస్ తర్వాత లీడ్ హీరోయిన్‌గా నటిస్తున్న తొలి సినిమా ఇదేనని వెల్లడించారు. మైత్రీ మూవీ మేకర్స్‌లో పనిచేయడం ఆనందంగా ఉందని, మౌళి తనూజ్ ప్రశాంత్ ప్రతిభావంతుడని, దర్శకుడు శ్రీను కంబాల ఎంతో ప్రశాంతంగా ఉంటారని ప్రశంసించారు. సినిమా టైటిల్, కథలోని వినోదం తనకు బాగా నచ్చాయని, ఇందులోని డ్యాన్స్ నంబర్ ప్రేక్షకులను అలరిస్తుందని తెలిపారు. రామ్‌చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్ తనకు ఇష్టమైన డ్యాన్సింగ్ హీరోలని, సంగీత దర్శకుడు సింజిత్ అద్భుతమైన సంగీతం అందించారని పేర్కొన్నారు. ‘మహానటి’ తరహాలో అన్ని భావోద్వేగాలున్న పాత్రలు, స్పోర్ట్స్ సినిమాలు, రొమాంటిక్ కామెడీలు, హారర్, సస్పెన్స్ థ్రిల్లర్స్ చేయాలని ఉందని, ప్రస్తుతం తమిళంలో రెండు ప్రాజెక్టులు చేస్తున్నానని తెలిపారు. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా, శ్రీను కంబాల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ‘దొంగ నా కొడుకు’ నవంబర్ 13న థియేటర్లలో విడుదల కానుంది.

‘ధర్మన’లో శ్రీలీల.. గ్లింప్స్ విడుదల

సరికొత్త అవతార్‌లో సందడి చేయనున్న శ్రీలీల

గ్లింప్స్‌తో పెరిగిన సినిమా అంచనాలు

‘ది డెడ్లీ డాక్టర్?’గా రజనీకాంత్

అనిరుధ్ సంగీతం ప్రత్యేక ఆకర్షణ

కమల్ హాసన్ నిర్మాణంలో అశ్వత్ మారిముత్తు దర్శకత్వం

సినిమా డెస్క్:



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న ‘ధర్మన్న సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో మరో స్టార్ హీరోయిన్ శ్రీలీలను పరిచయం చేస్తూ చిత్రబృందం ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో శ్రీలీల సరికొత్త, ఆకట్టుకునే అవతార్‌లో కనిపిస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం ఆమె పరిచయ సన్నివేశాలకు మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీలీల పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ఇచ్చిన ఆసక్తికరమైన క్యాప్షన్ కూడా సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది. ఆమె పాత్ర సినిమాలో ఎంతో సందడిగా ఉండబోతోందనే సంకేతాలను ఈ గ్లింప్స్ ద్వారా అందించారు. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్లపై కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్‌లో రజనీకాంత్ ‘ది డెడ్లీ డాక్టర??ణ అనే మిస్టీరియస్ డాక్టర్ పాత్రలో కనిపించి అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించారు. ఈ చిత్రంలో నయనతార కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రదీప్ ఈ. రాఘవ్ ఎడిటర్‌గా పనిచేస్తుండగా, ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్లు అన్బరివ్ యాక్షన్ సన్నివేశాలను రూపొందిస్తున్నారు. శ్రీలీలను సరికొత్త అవతార్‌లో పరిచయం చేసిన గ్లింప్స్‌తో సినిమా ప్రచార కార్యక్రమాల్లో మరింత జోష్ పెరిగింది. రజనీకాంత్, నయనతార, శ్రీలీల వంటి ప్రముఖ నటీనటులతో పాటు ప్రతిభావంతులైన సాంకేతిక బృందం పనిచేస్తుండటంతో ‘ధర్మన్న’పై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరుగుతున్నాయి.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM